



● పెనుమూడి సమీపంలో గుంతలమయంగా కరకట్ట

కరకట్టకు.. కోతలు

గుంతలమయంగా రహదారి

- ప్రమాదభరితంగా మారినా పట్టించుకోరు
- ఇసుక టిప్పర్ల తాకిడికి పూర్తిగా కుంగిన కట్ట
- వరదల సమయంలో అధికారులు హడావుడి

నదీ తీర ప్రాంతాలపై కృష్ణమ్మ కన్నెర్ర చేయకుండా కట్టడి చేయాల్సిన కరకట్ట ప్రమాదకరంగా మారింది. కోతలతో కట్ట ఎక్కడికక్కడ బలహీనంగా మారింది. పటిష్ఠంగా ఉండాల్సిన కరకట్ట రహదారి మొత్తం పెద్దపెద్ద గోతులతో నిండిపోయి ఉంది. కోతలు, గుంతలతో ఎప్పుడు ఏ ప్రమాదం ముంచుకు వస్తోందోనని కరకట్ట సమీప గ్రామాల ప్రజలు ఆందోళనలో ఉన్నారు. ప్రధానంగా వర్షాలు, వరదల సమయాల్లో అయితే రాత్రిళ్లు కంటిమీద కునుకు వేయరంటే పరిస్థితి అర్థం చేసుకోవచ్చు. గతంలో కరకట్టకు పలు ప్రాంతాల్లో కోతతో ఆయా గ్రామాలను వరద ముంచెత్తినా అధికారులు హడావుడితో సరిపెట్టారే కానీ పటిష్ఠ చర్యలు తీసుకోవడంలో తీవ్ర నిర్లక్ష్యం వహిస్తున్నారని ప్రజలు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.



గుంతలు పడిన కరకట్ట

గుంటూరు, జూలై 22(ఆంధ్రజ్యోతి): ప్రకాశం బ్యారేజీకి ఎగువన వైకుంఠపురం నుంచి.. దిగువన కృష్ణమ్మ సముద్రంలో కలిసే వరకు ఉన్న కరకట్ట ప్రమాదకరంగా మారింది. వరదపోటును నివారించడంలో కరకట్ట పాత్ర ఎంతో కీలకమైనా ప్రభుత్వం దాని పటిష్ఠతపై దృష్టి సారించడంలేదు. ఎన్నో దశాబ్దాలుగా కృష్ణానది పరివాహక ప్రాంతాలుగా ఉన్న గ్రామాలను కావలి కాసే కరకట్ట పెను ప్రమాదాన్ని ఎదుర్కొంటోంది. ఇసుక (మిగతా 6వ పేజీలో)

గాడి తప్పిన సంక్షేమం



సాంఘిక సంక్షేమ వసతి గృహాల పర్యవేక్షణలో నిర్లక్ష్యం

- కళాశాల బాలికల భద్రతపై నీలినీడలు
- అనేక ఘటనలు వెలుగు చూస్తున్నా.. పట్టించుకోని వైనం
- మౌలిక వసతులు, భోజనంపై విద్యార్థుల అసంతృప్తి

గుంటూరు (విద్య) జూలై 22 (ఆంధ్రజ్యోతి): పర్యవేక్షణ లోపం, సంక్షేమంపై నిర్లక్ష్యం వెరసి పేద విద్యార్థులకు శాపంగా మారింది. పాఠశాల, కళాశాల వసతి గృహాల్లో ఇది స్పష్టంగా కనిపిస్తోంది. గత ఐదేళ్లుగా సాంఘిక సంక్షేమ శాఖలో ఏకపక్ష నిర్ణయాలు ఇందుకు కారణంగా కనిపిస్తున్నాయి. నూతన డీడీ చెన్నయ్య ఆధ్వర్యంలో అయినా ఆ శాఖ పనితీరు మెరుగుపడు తుందా అనేది ప్రశ్నార్థకంగా మారింది. ఇటీవల నూతన డీడీ హాస్టల్ (మిగతా 6వ పేజీలో)

సాంఘిక సంక్షేమ శాఖలో ఔట్ సోర్సింగ్ సిబ్బంది నుంచి కొంతమంది అధికారులు నెలనెలా మామూళ్లు వసూలు చేస్తున్నారని ఫిర్యాదులు ఉన్నాయి. సిబ్బంది పనిచేయకపోయినా.. వారికి జీతాలు ఇస్తూ అందిన కాడికి దండుకుంటున్నారన్న ఆరోపణలున్నాయి.





ఉప సంఘంలో.. మంత్రులు

అనగాని, నాదెండ్ల

- జిల్లాల సరిహద్దులు, పేర్ల మార్పులకు క్యాబినెట్ సబ్ కమిటీ
- త్వరలో జిల్లాల్లో పర్యటించే అవకాశం

సేవ, నిజాయితీగా విధులు

నిర్వహించాలి

- ప్రొబేషనరీ ఎస్ఐలకు రేంజ్ ఐజీ త్రిపాఠి సూచన

కందుల డబ్బులు ఎప్పుడు

పడతాయబ్బా.!

- ఖరీఫ్ సాగు ఖర్చులకు రైతుల ఎదురుచూపులు

8

సెప్టెంబరు 29 నుంచి శబరి ప్రయాణ సమయం మార్పు

అమరావతి రైలు మార్గానికి..భూములిస్తాం !

- నష్టపరిహారం ఎంత ఇస్తారో చెప్పాలి
- కొప్పురావూరులోని కొంతమంది రైతులు జేసీకి నివేదన



● మంగళగిరి రైల్వే ట్రాకుపై పూర్తయిన ఆర్వోబీ

అనుసంధానం మొదలు



వెస్ట్‌బైపాస్ ఎంట్రన్స్ వద్ద జరుగుతున్న ఆర్చ్ నిర్మాణ పనులు

తుది దశకు వెస్ట్ బైపాస్ ప్యాకేజీ-4

- కాజ జంక్షన్ వద్ద అనుసంధాన పనులు
- ఎన్‌హెచ్- 16 రాకపోకలు సర్వీసు రోడ్డులోకి మళ్లింపు
- సెప్టెంబరు చివరి నాటికి అందుబాటులోకి..

గుంటూరు, జూలై 22 (ఆంధ్రజ్యోతి): విజయవాడ, గుంటూరు నగరాల ట్రాఫిక్‌ను క్రమబద్ధీకరించడం, రాజధాని అమరావతిని అన్ని జిల్లాలకు అనుసంధానించడంలో అత్యంత కీలకమైన వెస్ట్ బైపాస్ నిర్మాణ పనులు తుది దశకు చేరుకున్నాయి. ఎన్టీ ఆర్ జిల్లా విజయవాడ పక్కనే ఉన్న గొల్లపూడి నుంచి గుంటూరు జిల్లా కాజ టోల్‌గేటు వరకు సా గుతున్న ప్యాకేజీ 4 నిర్మాణ పనులు దాదాపుగా పూర్తయ్యాయి. ప్రస్తుతం కాజ టోల్ గేట్‌కు సమీపంలో ఈ రోడ్డును ఎన్‌హెచ్-16లో అనుసంధానించే పనులు ముమ్మరంగా సాగుతున్నాయి.


● కీలకమైన బ్రిడ్జి పూర్తి

విజయవాడ వెస్ట్ బైపాస్‌ను ప్యాకేజీ- 4 కింద 18.2 కిలోమీటర్ల మేర ఆరు వరుసల్లో నిర్మిస్తున్నారు. ఇందులో కృష్ణానదిపై 3.2 కిలోమీటర్ల మేర నిర్మించే బ్రిడ్జి అత్యంత కీలకమైంది. ఈ బ్రిడ్జి నిర్మాణం దాదాపు మూడు నెలల క్రితమే పూర్త యింది. రాజధాని అమరావతి పునర్నిర్మాణ కార్యక్ర మంలో భాగంగా మే 2న ఈ బ్రిడ్జి అందుబాటు లోకి కూడా వచ్చింది. ఈ సమయంలో ఎన్టీఆర్, కృష్ణా, ఉమ్మడి తూర్పు, పశ్చిమ గోదావరి, ఉత్తరాంధ్ర జిల్లాల కూటమి ముఖ్య నేతలకు ఈ బ్రిడ్జి మీద నుంచే రూట్ మ్యాప్ ఇచ్చారు. జూన్ నుంచి బ్రిడ్జి అందుబాటులోకి వస్తుందని భావించినప్పటికీ మిగిలిన ప్రాంతాల్లో పనులు పెండింగ్ ఉండడంతో బ్రిడ్జి ఇప్పటి వరకు అందుబాటులోకి రాలేదు.

మందడం టోల్‌గేట్ (మిగతా 6వ పేజీలో)

సాగర్ @ 570 అడుగులు

- జలాశయానికి పెరగనున్న వరద
- శ్రీశైలం నుంచి 93,000 క్యూసెక్కులు విడుదల



570 అడుగుల నీటి మట్టం

(నరసరావుపేట, కారంపూడి, ఆంధ్రజ్యోతి)

నాగార్జునసాగర్ జలాశయానికి వరద ప్రవాహం కొనసాగుతోంది. నీటి మట్టం మంగళవారం 570 అడుగులకు చేరింది. శ్రీశైలం ప్రాజెక్టు ఒక గేటు ఎత్తి సాగర్‌కు 67,346 క్యూసెక్కుల నీటిని విడుదల చేశారు. బుధవారం వరద ప్రవాహం పెరగనుంది. సాగర్‌కు నీటి ప్రవాహం 90 వేల కూసెక్కులకు చేరనుంది. సాగర్ పూర్తి స్థాయి సామర్థ్యం 312.04 టీఎంసీలు(590 అడుగులు) కాగా 259 టీఎంసీలకు చేరింది. ఎస్ఎల్‌బీసీకి 1,800, విద్యుత్ ఉత్పత్తి ద్వారా 3,035 క్యూసెక్కులను డ్యాం నుంచి విడుదల చేస్తున్నారు.

నాగులేటికి జలకళ

రెండు నెలలుగా చుక్క నీరు లేక ఎండిపోయిన కారంపూడి మండలంలో ప్రసిద్ధిగాంచిన నాగులేరు ప్రస్తుతం జలకళ సంతరించుకుంది. నాలుగు రోజులుగా కురుస్తున్న భారీ వర్షాలకు నాగులేరు నిండు కుండలా మారింది.

'మాచర్ల' సమగ్రాభివృద్ధికి మాస్టర్‌ప్లాన్

- అధికారులతో ఎమ్మెల్యే జూలకంటి సమీక్ష

మాచర్లటౌన్, జూలై 22 (ఆంధ్రజ్యోతి): మాచర్ల పట్టణ సమగ్రాభివృద్ధికి కూటమి ప్రభుత్వం కట్టుబడి ఉందని స్థానిక ఎమ్మెల్యే జూలకంటి బ్రహ్మానందరెడ్డి పేర్కొన్నారు. మంగళవారం వెల్దుర్తిలోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో మాచర్ల పట్టణ మున్సిపల్ కమిషనర్ ధూళిపాళ్ల వేణుబాబు, టౌన్ ప్లానింగ్ అధికారులతో ఆయన భేటీ అయ్యారు. పట్టణ సమగ్రాభివృద్ధికి రూపొందించిన నూతన మాస్టర్ ప్లాన్‌ను అధికారులు ఎమ్మెల్యేకు వివరించారు. ప్లాన్‌ను పరిశీలించిన ఎమ్మెల్యే జూలకంటి అధికారులకు పలు సూచనలు చేశారు. మాచర్ల పట్టణం, రాయవరం కలుపుకొని రెసిడెన్షియల్, నాన్ రెసిడెన్షియల్, ఇండస్ట్రీయల్, రోడ్లు వంటి వాటిపై అధికారులతో ఆయన సుదీర్ఘంగా చర్చించారు.



మాస్టర్ ప్లాన్ మ్యాప్‌ను పరిశీలిస్తున్న ఎమ్మెల్యే జూలకంటి బ్రహ్మానందరెడ్డి

నూతన జోనల్ మ్యాప్ సిద్ధం!

పెరుగుతున్న జనాభా దృష్ట్యా ఎమ్మెల్యే జూలకంటి ఆదేశాల మేరకు నూతన టౌన్ ప్లానింగ్ జోన్స్ మార్పు అనివార్యమైంది. దీనిపై మున్సిపల్ యంత్రాంగం ఎంతో క్లారిటీగా కసరత్తు మొదలుపెట్టింది. 27 ఏళ్ల క్రితం ఉన్న టౌన్ ప్లానింగ్‌ను పునరుద్ధరించనున్నారు. ముఖ్యంగా జనావాసాలకు దూరంగా పరిశ్రమలు, దగ్గరగా కమర్షియల్ బిజినెస్ సదుపాయాల ఏర్పాటుకు ప్రస్తుతం ఉన్న టౌన్ ప్లానింగ్‌లో మార్పులు చేయనున్నారు. అలాగే ఉన్న రోడ్ల విస్తరణకు తగిన స్థలాన్ని కేటాయిస్తూ న్యూ ప్లాన్‌లో మున్సిపల్ అధికారులు సబ్ డివిజన్ చేయనున్నారు.

ప్రజాభిప్రాయానికి ప్లాన్..

మాస్టర్ టౌన్ ప్లానింగ్‌లో చేసిన మార్పులపై ప్రజాదర్బార్ తరహాలో సభలు ఏర్పాటు చేయనున్నారు. ముందుగా డ్రాఫ్ట్ నోటిఫికేషన్ ఇచ్చి ఉన్నతాధికారులు, ప్రజా ప్రతినిధులతో (మిగతా 6వ పేజీలో)

భారీ వర్షాలతో.. ఉధృతంగా వాగులు

దాచేపల్లిలో అత్యధికంగా 88.2 మిమీ వర్షం

నరసరావుపేట, జూలై 22 (ఆంధ్రజ్యోతి): జిల్లా అంతటా భారీ వర్షాలు కురుస్తున్నాయి. వాగులు ఉధృతంగా ప్రవహిస్తున్నాయి. పల్లపు ప్రాంతాల్లోని పత్తి చేలల్లో వర్షపు నీరు నిలిచింది. నిన్నటి వరకు వర్షాభావంతో



నరసరావుపేట వల్లపు చెరువు అలుగు ద్వారా ప్రవహిస్తున్న నీరు

ఎండిన పత్తి ప్రస్తు తం అధిక వర్షాలతో ఉరకెత్తే పరిస్థితులతో రైతులు ఆందోళన చెందుతున్నారు. దాచేపల్లి మండలంలో అత్యధికంగా 88.2 మిమీ వర్షపాతం నమోదైంది. దుర్గి మండలంలో 87 మిమీ, చిలకలూరిపేట 80.2, మాచర్ల 77.2, మాచవరం 75.2, నరసరావుపేట 68.8, నాదెండ్ల 68.6, ముప్పాళ్ల 58.6, సత్తెనపల్లి 56.8 కారంపూడి 52.2, రెంటచింతల 52.2, బెల్లంకొండ 38.4, యడ్లపాడు 42.6, వెల్దుర్తి 35.6, శావల్యాపురం 34.6, ఈపూరు 30.4, రొంపిచర్ల 37.8, పిడుగురాళ్ల 27.4, అచ్చంపేట 28.4, క్రోసూరు 23, అమరావతి 18.6, పెదకూరపాడు 17, వినుకొండ 14, నూజెండ్ల మండలాల్లో 14.2 మిమీ వర్షపాతం నమోదైనట్లు వాతావరణ శాఖ పేర్కొంది.

పుడా.. ప్రేక్షకపాత్ర!

- అధికారాలున్నా..పట్టించుకోని వైనం
- ఏడాదిగా చైర్మన్ నియామకం లేదాయె
- వైస్ చైర్మన్, ఇంజనీర్లూ లేని వైనం..
- ఇబ్బడి ముబ్బడిగా అక్రమ వెంచర్లు



నరసరావుపేటలోని పుడా కార్యాలయం

(నరసరావుపేట, ఆంధ్రజ్యోతి)

పల్నాడు పట్టణాభివృద్ధి సంస్థ (పుడా) అలంకార ప్రాయంగా మారింది. ఏడాదిగా చైర్మన్, వైస్ చైర్మన్ పదవులు భర్తీకి నోచుకోలేదు. అధికారాల్లో కూడా ప్రభుత్వం కోత విధించింది. అనధికారిక లేఅవుట్లు.. జిల్లాలో వందల సంఖ్యలోనే ఉన్నా చర్యలు తీసుకోవడంలో పుడా ప్రేక్షక పాత్ర వహిస్తోంది. ఇంజనీర్ల కొరత కూడా నెలకొంది. నరసరావుపేట కేంద్రంగా పల్నాడు అర్బన్ డెవలప్‌మెంట్ అథారిటీ 7281.31 చదరపు కిలోమీటర్ల పరిధితో ఏర్పాటైంది. నరసరావుపేట, చిలకలూరిపేట, వినుకొండ, సత్తెనపల్లి, పిడుగురాళ్ళ, మాచర్ల, గురజాల, దాచేపల్లి మునిసిపాల్టీలను, జిల్లాలోని 28 మండలాలు, 349 గ్రామాలు అథారిటీ పరిధిలోనే ఉన్నాయి. ఏడాదిగా నరసరావుపేటలో పుడా కార్యాలయం అద్దె భవనంలో నిర్వహిస్తున్నారు. చైర్మన్, డైరెక్టర్ల పదవుల కోసం ఆశావహులు ఎదురు చూస్తున్నారు. చైర్మన్ రేసులో పలువురు టీడీపీ నేతలు ఉన్నారు.

భారీగా అనధికార లేఅవుట్లు..

పుడా పరిధిలో అనధికార రియల్ ఎస్టేట్ లేఅవుట్లు భారీగానే ఉన్నాయి. దీంతో ప్రభుత్వ ఆదాయానికి భారీగా గండి పడుతోంది. పంచాయతీలు గుర్తించిన అనధికారి లేఅవుట్లు ఒక్క నరసరావుపేట పట్టణ పరసరాల్లో 8,141 ప్లాట్‌లు ఉన్నాయి. 1046.4 ఎకరాల్లో ఈ లేఅవుట్లు ఏర్పాటయ్యాయి. జిల్లాలోని 18 మండలాల్లో 76 పంచాయతీల పరిధిలో 3992.21 ఎకరాల్లో 22,069 ప్లాట్లు ఉన్నట్లు గుర్తించారు. ఇవి పుడా పరిధిలోకి వచ్చాయి. వీటిల్లో వాగులు, పంట కాల్వలు పూడ్చివేసిన ప్లాట్లూ ఉన్నాయి. ప్రభుత్వ, అసైన్డ్, రిజిస్ట్రేషన్‌లను నిషేధించిన భూముల్లో కూడా రియల్ వెంచర్లు వేశారు. పుడా నిబంధనల ప్రకారం రియల్ వెంచర్లలో ప్రధాన రహదారులు 60 అడుగులు, అంతర్గత రోడ్లు 40 అడుగులు నిర్మించాలి. కానీ, 30, 20 అడుగులకు మించి ఎక్కడా రోడ్లు లేవు. సాగర్ కాల్వల కట్టలను రహదారులుగా వినియోగించుకుంటూ ప్లాట్‌లు వేసి విక్రయిస్తున్నారు. అనధికారిక లేవుట్‌లపై పుడా చర్యలు తీసుకోవాలి. ఇవేవి అమలు జరుగుతున్న దాఖలాలు లేవు.

మునిసిపాలిటీకే..భవనాల ప్లాన్లు

పట్టణాలకు మాస్టర్ ప్లాన్, జోనల్ డెవలప్‌మెంట్ ప్లాన్‌లు రూపొందించడం, మెరుగుపరడచం, నియంత్రించడం, అక్రమ లేఅవుట్లు, నిర్మాణాలపై చర్యలు తీసుకునే అధికారం పుడాకు ఉంది. భవనాలు, లేఅవుట్‌లకు అనుమతుల జారీ, అభివృద్ధి చెందుతున్న ప్రాంతాల్లో మౌలిక వసతులు, ప్రజలకు వినోద సౌకర్యాలు, ప్రభుత్వ, మునిసిపల్, పంచాయతీ స్థలాల్లో వాణిజ్య సముదాయాల నిర్మాణం, ఆదాయ పెంపు బాధ్యతలను చేపట్టాలి. అయితే పుడా అధికారాల్లో ప్రభుత్వం కొత్త విధించింది. పట్టణాల్లో భవనాల ప్లాన్‌ల మంజూరును మునిసిపాలిటీలకే అప్పగించింది.

ఆక్రమణల తొలగింపు

సత్తెనపల్లి, జూలై 22 (ఆంధ్రజ్యోతి) : పట్టణంలోని ప్రధాన రహదారిలో రోడ్లను ఆక్రమించి నిర్మించిన దుకాణాలను మంగళవారం టౌన్ ప్లానింగ్ అధికారుల, సిబ్బంది తొలగించారు. ఎంతో కాలంగా తాము వ్యాపారాలు చేసుకుంటుంటే తమ షాపులను తొలగించటం ఏంటని చిరు వ్యాపారులు ప్రశ్నించారు. ట్రాఫిక్‌కు అంతరాయంగా ఉన్న షాపులను తొలగించాల్సిందేనని టౌన్ ప్లానింగ్ అధికారులు, సిబ్బంది స్పష్టం చేశారు. ఆక్రమణదారుల షాపులు రోడ్డుపైకి వస్తే సహించేది లేదన్నారు.



కరకట్టకు.. కోతలు

(5వ పేజీ తరువాయి)



ఓలేరుపల్లెపాలెంవద్ద కుంగిన కరకట్ట

టిప్పర్ల రాకపోకలతో ఎక్కడికక్కడ గోతులకు తోడు.. నదిలోని నీటిని వినియోగించుకునేందుకు గండ్లుకొట్టి వేసుకున్న పైపులతో కట్ట శిథిలావస్థకు చేరింది. శిథిలమైన కరకట్ట ప్రస్తుతం బలహీనంగా మారింది. కట్టపై యథేచ్ఛగా రాకపోకలు సాగిస్తున్న ఇసుక టిప్పర్ల నియంత్రణపై, అక్రమంగా పైపులైన్లు వేసుకుంటున్న వారిపై అధికారులు చర్యలు తీసుకోవడంలో నిర్లక్ష్యం వహిస్తున్నారు. అధికారుల నిర్లక్ష్యంతో కరకట్ట ప్రమాదకరంగా మారింది. అసలే అంతంతమాత్రంగా ఉన్న కరకట్ట ఇసుక తరలించే వాహనాలతో మరింత అధ్వానంగా మారింది. పెద్దపెద్ద గోతులతో నిండిపోయి ఎక్కడికక్కడ కుంగిపోయింది. పలుచోట్ల భారీగా కరకట్ట కోసుకుపోయింది. 2009 అక్టోబరు 5న తెల్లవారుజామున రేపల్లె మండలంలోని ఓలేరు పల్లెపాలెం వద్ద భారీ గండి పడి వరద నీరు చుట్టుపక్కల గ్రామాలను, పొలాలను ముంచెత్తింది. అప్పటి నుంచి ప్రతిఏటా వరదల సమయంలో ప్రత్యక్షమయ్యే అధికారులు, ప్రజాప్రతినిధులు కట్టను పటిష్ఠం చేస్తామంటూ ప్రకటనలు చేస్తున్నారే తప్ప పదేళ్లుగా పట్టించుకోలేదు. ఓ మోస్తరుగా నదిలో నీరు ప్రవహిస్తున్నా అది సమీప గ్రామాలను ముంచెత్తుతోంది. ప్రస్తుతం ఎగువ నుంచి భారీగా వరద వస్తోంది. పైగా బ్యారేజి గేట్లు ఎత్తి దిగువకు నీటిని విడుదల చేస్తున్నారు. దీంతో ఎప్పుడు ఏ ప్రమాదం ముంచుకు వస్తుందోనని కట్ట వెంబడి గ్రామాల ప్రజలు ఆందోళన చెందుతున్నారు. కరకట్ట పటిష్ఠతను ఎప్పటికప్పుడు పరిశీలించాల్సిన కృష్ణారివర్ అథారిటీ అధికారులు కనీసం కట్టలపై దృష్టి సారించిన దాఖలాలు లేవు. వాహనాల రాకపోకలు, పైపులైన్లు వేసిన ప్రాంతాల్లో ఇప్పటికే కట్ట పూర్తిగా బలహీనపడింది. ఇలాంటి చోట్ల గండ్లు పడే ప్రమాదం పొంచి ఉంది. కిందటేడాది వచ్చినట్లు వరద వస్తే కట్ట మీద నుంచి రాజధానితో పాటు బ్యారేజీ దిగువన ఉన్న గ్రామాల్లోకి నీరు వచ్చే ప్రమాదం ఉందని స్థానికులు ఆందోళన చెందుతున్నారు. నది నుంచి ఇసుకను తరలించే భారీ టిప్పర్లు నిత్యం వందల సంఖ్యలో కరకట్టపై రాకపోకలు సాగిస్తున్నాయి. దీంతో రాజధాని గ్రామాలైన లింగాయపాలెం, ఉద్దండరాయునిపాలెంలో కరకట్ట పరిస్థితి అత్యంత ప్రమాదకరంగా మారింది. గత వైసీపీ హయాంలో అప్పటి ఎంపీ నందిగం సురేశ్ నేతృత్వంలో టిప్పర్ల రాకపోకలతో కరకట్ట పూర్తిగా ధ్వంసమైపోయింది. బ్యారేజి దిగువన పిరాట్లంక, చెన్నుపల్లివారిపాలెం, కనగాలవారిపాలెం సమీపంలో పైప్‌లైన్లతో ప్రమాద భరితంగా మారింది. దీంతో మైనేనివారిపాలెం, పిరాట్లంక, చెన్నుపల్లివారిపాలెం, గంగడిపాలెం, లక్ష్మీపురం, అడవిపాలెం గ్రామాల ప్రజలు భయాందోళనకు గురవుతున్నారు. కట్టను పటిష్ఠం చేయాలని ఆయా గ్రామాల ప్రజలు అధికారులను, ప్రజాప్రతినిధులను కోరినా ఇప్పటి వరకు దాని గురించి పట్టించుకోలేదంటున్నారు. కరకట్టపై పెట్రోలింగ్ చెయ్యాల్సిన అధికారులు స్థానికంగా ఉండకుండా గుంటూరులో నివాసం ఉంటున్నారు. దీంతో కట్టపై పర్యవేక్షణ పూర్తిగా కొరవడింది. గత ఏడాది వరదల సమయంలో కృష్ణారివర్ ఏఈ ప్రత్యక్షమై హడావుడి చేశారు. ఆ తర్వాత ఈ పదినెలల్లో ఒక్కసారి కూడా కట్టను పరిశీలించిన దాఖలాలు లేవు.

భూ ఆక్రమణలపై విచారణ

● ఆంధ్రజ్యోతి కథనానికి స్పందన

పిడుగురాళ్ల, జూలై 22 (ఆంధ్రజ్యోతి): గురజాల నియోజకవర్గంలో గత ఐదేళ్ల వైసీపీ పాలనలో ప్రభుత్వ, పట్టా భూములు యథేచ్ఛగా ఆక్రమణల గురయ్యాయి. వైసీపీ నేతల కనుసన్నల్లో రికార్డుల ట్యాంపరింగ్‌పై మంగళవారం ఆంధ్రజ్యోతిలో ప్రచురితమైన భూ ఆక్రమణలపై విచారణ ఎప్పుడో కథనానికి పల్నాడు జిల్లా రెవెన్యూ అధికారులు స్పందించారు. జిల్లా జాయింట్ కలెక్టర్ సూరజ్ గనోరే గురజాల రెవెన్యూ డివిజనల్ అధికారితో ఫోన్‌లో మాట్లాడి ఆంధ్రజ్యోతిలో వచ్చిన కథనంపై చర్చించారు. ప్రభుత్వ భూములు, వాటిలో ఆక్రమణలకు గురైన వాటి వివరాలు, ఆ భూములు ఎవరెవరి ఆధీనంలో ఉన్నాయో.. తదితర వివరాలతో నివేదిక పంపాలని ఆదేశించారు. అనంతరం గురజాల ఆర్డీఓ మురళీకృష్ణ కూడా నాలుగు మండలాల తహసీల్దార్లతో మాట్లాడారు. ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు ప్రభుత్వ భూముల వివరాలతో పాటు గత ప్రభుత్వ హయాంలో పట్టా భూములను అక్రమంగా లేక బెదిరింపులకు పాల్పడి అన్యాక్రాంతం చేసుకున్న వైనంపై అందిన ఫిర్యాదుల వివరాలను కూడా తెలపాలని ఆదేశించారు. ఈ విషయంపై నిర్లక్ష్యంగా ఉన్న రెవెన్యూ అధికారులను ఉపేక్షించేది లేదని ఈ సందర్భంగా హెచ్చరించారు.

నాటి ఇసుక అక్రమాలపై నేడు చర్యలు

● శాటిలైట్ ఛాయా చిత్రాలతో ఇసుక అక్రమాలు గుర్తింపు

నరసరావు పేట, జూలై 22 (ఆంధ్రజ్యోతి): వైసీపీ ప్రభుత్వం హయాంలో జరిగిన ఇసుక అక్రమాలపై జిల్లా యంత్రాంగం దృష్టి సారించింది. 2021-2024 కాలానికి జిల్లాలోని ఇసుక రీచ్‌లలో అక్రమ తవ్వకాలు చేపట్టిన వారిపై చర్యలు తీసుకొనేందుకు ఇసుక కమిటీ సిద్ధమైంది. శాటిలైట్ ఛాయా చిత్రాల ఆధారంగా 126 హెక్టార్లలో ఇసుక అక్రమ తవ్వకాలు జరిగినట్లు నిర్ధారించారు. ఈ నేపథ్యంలో సంబంధిత సంస్థలను, బాధ్యులను గుర్తించారు. అక్రమార్కులపై కేసులు నమోదు చేసేందుకు ఇసుక కమిటీ చర్యలు చేపట్టింది. జేసీ సూరజ్ మంగళవారం ఇసుక కమిటీ సమావేశం నిర్వహించారు. జిల్లాలో పెద్ద ఎత్తున జరిగిన ఇసుక తవ్వకాలపై యంత్రాంగం చర్యలు ఉపక్రమించింది. మాచర్ల నియోజకవర్గంలో నూతన ఇసుక స్టాక్ పాయింటును వారం రోజుల్లోగా ఏర్పాటు చేయాలని కమిటీ నిర్ణయించింది. జిల్లాలో అక్టోబరు 15 వరకూ ఇసుక తవ్వకాలపై నిషేధం ఉంటుందని, అప్పటి వరకూ తవ్వకాలను నిరోధించేందుకు జిల్లా, మండల స్థాయి టాస్క్ ఫోర్సులు పని చేస్తాయని జేసీ తెలిపారు. జేసీ అధ్యక్షతన జరిగిన సమావేశంలో అదనపు ఎస్పీ జేవీ సంతోష్, జిల్లా మైన్స్ జియాలజీ అధికారి నాగిని, ఆర్డీవోలు రమణాకాంత్‌రెడ్డి, మురళీ కృష్ణ, భూగర్భ జల శాఖ ఏడీ రామబాలాజీ రెడ్డి, పిడుగురాళ్ల మోటార్ వెహికిల్ ఇన్‌స్పెక్టర్ రాంబాబు పాల్గొన్నారు.

వేటకు వెళ్లిన మత్స్యకారుడి మృతి

నిజాంపట్నం(రేపల్లె),జూలై22 (ఆంధ్రజ్యోతి): చేపల వేట చేస్తూ ప్రమాదవశాత్తు సముద్రంలో పడి కొత్తపాలెం పంచాయతీ శారదా నగర్‌కు చెందిన బాల కోటయ్య మృతి చెందాడని అడవులదీవి ఎస్‌ఐ బాబూరావు తెలిపారు. మంగళవారం కొత్తపాలెం సముద్ర సమీపంలో పడవలో వేటకు వెళ్లగా అలల తాకిడికి సముద్రంలో పడి బాల కోటయ్య(23)మృతి చెందాడని చెప్పారు. ఇతర మత్స్యకారులు గమనించి మృతదేహాన్ని ఒడ్డుకు చేర్చారు. ఈ విషయాన్ని గ్రామస్తులకు తెలపడంతో పోలీసులకు ఫిర్యాదు చేశారు. మృతునికి భార్య, కుమారుడు, కుమార్తె ఉన్నారు. ఘటన స్థలానికి పోలీసులు చేరుకుని విచారించారు. కేసు నమోదు చేసి, పోస్టుమార్టం నిమిత్తం మృతదేహాన్ని రేపల్లె ప్రభుత్వ వైద్యశాలకు తరలించారు.

ప్రమాదవశాత్తూ రైలు ఢీకొని..

తెనాలి, మారీసుపేట, జూలై 22 (ఆంధ్రజ్యోతి): పట్టాలు దాటుతుంగా రైలు ఢీకొని వ్యక్తి మృతి చెందిన ఘటనపై కేసు నమోదు చేసినట్లు రైల్వే పోలీసులు తెలిపారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. స్థానిక చెంచుపేటకు చెందిన డి జాన్‌బాబు (55) గుంటూరు ఆర్ అండ్ బీ డిపార్ట్‌మెంట్‌లో జూనియర్ టెక్నికల్ ఆఫీసర్‌గా విధులు నిర్వహిస్తున్నాడు. గత కొంతకాలంగా పెరాల్సిస్ రావడంతో ఇంటి వద్దనే ఉంటున్నాడు. ఈ క్రమంలో మంగళవారం తెనాలి రైల్వే స్టేషన్ 4వ నంబరు ప్లాట్‌ఫాం వద్ద పట్టాలు దాటుతుండగా రైల్ రావడం గమనించక ట్రైన్ ఢీకొని మృతి చెందాడు. ట్రైన్ లోకో పైలేట్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి, దర్యాప్తు చేస్తున్నట్లు రైల్వే పోలీసులు తెలిపారు. మృతుడు జాన్‌బాబుకు భార్య, కుమార్తె ఉన్నారు.

అంధ బాలిక హత్య కేసులో.. రౌడీషీటర్‌కి జీవిత ఖైదు

గుంటూరు (లీగల్), జూలై 22(ఆంధ్రజ్యోతి): అంధ బాలికను హత్య చేసిన కేసులో నిందితుడికి జీవిత ఖైదు విధిస్తూ పోక్సో న్యాయస్థానం జడ్జి షమ్మి పర్విన్ సుల్తాన్ బేగం మంగళవారం తీర్పు చెప్పారు. ప్రాసిక్యూషన్ కథనం ప్రకారం తాడేపల్లి పట్టణంలోని ఎన్‌టీఆర్ కట్ట వద్ద 2023 ఫిబ్రవరి 12న ఒంటరిగా ఉన్న 17 ఏళ్ల అంధ బాలికపై నిందితుడు నాగపోగు దయానందరాజు అలియాస్ కుక్కల రాజు తన కోర్కె తీర్చలేదన్న కక్షతో కత్తితో విచక్షణారహితంగా నరికివేశాడు. తీవ్రంగా గాయపడిన బాలికను విజయవాడ ప్రభుత్వ ఆస్పత్రికి తరలించగా 13న చికిత్స పొందుతూ బాలిక మృతి చెందింది. వ్యసనాలకు బానిసైన కుక్కల రాజు భార్య, తల్లిదండ్రులకు దూరంగా ఉంటూ కొంతకాలంగా ఈ ప్రాంతంలో నివశిస్తూ ఈ బాలికపై కన్నేశాడు. తల్లి పనులకు వెళ్లిన సమయంలో బాలిక తన చిన్నమ్మ ఇంటి వద్ద కూర్చొని ఉంది. ఈ సమయంలో నిందితుడు తన కోర్కె తీర్చమని కోరగా బాలిక ఇంట్లోకి వెళ్లి తలుపులు వేసుకుంది. కొద్దిసేపటికి బాలిక తల్లి రాగా విషయం తెలుసుకుంది. ఈ విషయంపై బాలిక తల్లి కుక్కల రాజును నిలదీసింది. అనంతరం బాలికను తన ఇంట్లో ఉంచి కిరణా దుకాణం వద్దకు ఆమె వెళ్లింది. దీంతో ఒంటరిగా ఉన్న బాలికపై రాజు ఆగ్రహంతో కత్తితో శరీరం మొత్తం నరికి తీవ్రంగా గాయపర్చాడు. వెంటనే తల్లివచ్చి ఘొల్లుమంది. 108 వాహనంలో బాలికను విజయవాడ ఆస్పత్రికి తరలించారు. చికిత్స పొందుతూ బాలిక మృతి చెందింది. నిందితుడి కుక్కల రాజును తాడేపల్లి పోలీసులు అరెస్టుచేసి కోర్టులో హాజరు పర్చారు. కోర్టులో అప్పటి దిశ మహిళా పోలీస్‌స్టేషన్ సౌత్ డీఎస్పీ జెస్సీ ప్రశాంతి చార్జిషీటు దాఖలు చేశారు. నిందితుడు గత రెండున్నర ఏళ్లుగా జైలులో ఉన్నాడు. విచారణలో ప్రాసిక్యూషన్ నేరం రుజువు చేయడంతో జీవిత ఖైదు, రెండు రూ.వేల జరిమానా విధిస్తూ న్యాయమూరి తీర్పు నిచ్చారు. ఈ కేసులో మైనర్ బాలిక హత్యకు సంబంధించి పోక్సో చట్టం కింద 5 ఏళ్ల జైలు శిక్షతో పాటు జీవిత ఖైదు ఏకకాలంలో అమలు చేయాలని న్యాయమూర్తి చెప్పారు. ఈ కేసులో ప్రత్యక్ష సాక్షి గడ్డం మాధురి కీలక సాక్ష్యం చెప్పారు. అంధబాలికను నరికిన సమయంలో రక్తం చింది నిందితుడు కుక్కల రాజు చొక్కాపై పడటంతో.. పోలీసులు బాలిక రక్తం, నిందితుడు చొక్కాపై పడిన రక్తం నమూనాలను డీఎన్‌ఏ పరీక్షలకు పంపగా ఒక్కటేనని తేలింది. ఈ నివేదిక కేసులో కీలక సాక్ష్యంగా నిలిచింది. ప్రాసిక్యూషన్ తరుపున జిల్లా డిప్యూటీ డైరక్టర్ ఎండి బర్కత్ అలీఖాన్ నిర్వహించారు.

కూలిన జీవితం..



కూలిన కల్వర్టు స్లాబ్, తోట అప్పారావు(ఇన్‌సెట్)

గుంటూరు కార్పొరేషన్, జూలై 22(ఆంధ్రజ్యోతి): గుంటూరులో కల్వర్టు నిర్మాణంలో ఉన్న పనుల్లో స్లాబ్ కూలి కార్మికుడు మృతి చెందిన ఘటన మంగళవారం జరిగింది. నగరంలోని దేవాపురం పీకల వాగుపై కల్వర్టు నిర్మాణ పనులు జరుగుతున్నాయి. నగరపాలక సంస్థ చెందిన కాంట్రాక్టర్ కావూరి కృష్ణ చైతన్య ఈ పనులను రూ.8 లక్షలకు టెండర్ దక్కించుకొని పనులు ప్రారంభించాడు. కల్వర్టు స్లాబు పనులు చివరి దశలో ఉన్నాయి. కూలి పనులకు వచ్చిన గోరంట్లకు చెందిన తాపీ కార్మికుడు తోట అప్పారావు(50) కిందుకు దిగి.. స్లాబ్ కింద పెట్టిన కర్రలను పరిశీలిస్తున్నాడు. ఈ క్రమంలో ముందుకు పడబోయిన ఆయన స్లాబ్‌కు పెట్టిన కర్రను లాగడంతో.. నిర్మాణ దశలో ఉన్న స్లాబ్ మొత్తం కూలి అతనిపై పడింది. అప్పారావు స్లాబ్ కింద పడిపోయి అక్కడే మృతి చెందాడు. నగర మేయర్ రవీంద్ర, కమిషనర్ పులి శ్రీనివాసులు, ఇంజనీరింగ్ అధికారులు ఘటన స్థలానికి చేరుకొని పొక్లెయినర్‌తో ద్వారా స్లాబ్‌ను తొలగించారు. మృతదేహాన్ని బయటకు తీసి.. పోస్టుమార్టం నిమిత్తం గుంటూరు ప్రభుత్వ ఆసుపత్రి తరలించారు.

అనారోగ్యంతో వ్యక్తి ఆత్మహత్య

ఈపూరు, జూలై22(ఆంధ్రజ్యోతి): అనారోగ్యంతో బాధపడుతూ వ్యక్తి ఆత్మహత్య చేసుకున్న ఘటన మండలంలోని బొమ్మరాజుపల్లిలో జరిగింది. గ్రామానికి చెందిన పందిరి నాగేశ్వరరావు(52) గత కొంత కాలంగా కడుపులో నొప్పితో బాధపడుతున్నాడు. వైద్యం చేయించుకోవడానికి ఆర్థిక ఇబ్బందులుండడంతో.. బాధ తట్టుకోలేక సోమవారం తెల్లవారుజామున ఇంట్లో ఉరేసుకొని ఆత్మహత్య చేసుకున్నట్లు బంధువులు మంగళవారం పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఈ మేరకు కేసు నమోదు చేసినట్లు ఏఎస్ఐ సాంబయ్య తెలిపారు.

గాడితప్పిన సంక్షేమం

(5వ పేజీ తరువాయి)

వెల్ఫేర్ ఆఫీసర్లతో ప్రత్యేకంగా సమావేశం నిర్వహించి మార్గదర్శకాలు జారీ చేశారు.

ఐదేళ్లుగా సమీక్షలు నిల్

ఉమ్మడి గుంటూరు జిల్లాలో సాంఘిక సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో కళాశాల, పాఠశాల విద్యార్థుల కోసం ప్రత్యేకంగా వసతి గృహాలున్నాయి. వీటిల్లో దాదాపు పదివేల మందికి పైగా విద్యార్థులు వసతి పొందుతూ విద్యాభ్యాసం చేస్తున్నారు. వసతి గృహాలను పరిశీలిస్తే.. ఒకరిద్దరూ మినహా మిగిలిన హాస్టల్ వెల్ఫేర్ ఆఫీసర్లు పూర్తిస్థాయిలో పర్యవేక్షిస్తున్న దాఖలాలు కనిపించడం లేదు. ఫలితంగా అనేక సమస్యలు వసతి గృహాల్లో తిష్ట వేశాయి. గుంటూరు నగరంలోనే పరిపాలన గాడి తప్పిందంటే మారుమూల ప్రాంతాల్లోని వసతి గృహాల పరిస్థితి ఏ విధంగా ఉందో అర్థం చేసుకోవచ్చు.

సంక్షేమ వసతి గృహాల్లో దారుణాలు

- గుంటూరులోని సంక్షేమ శాఖ వసతి గృహంలో వాచ్‌మెన్, ఆయాల ప్రోద్బలంతో కొంతమంది ఆకతాయిలు విద్యార్థుల్ని లైంగికంగా వేధించిన ఘటనలున్నాయి.
- నగరంలోని కలెక్టర్ బంగ్లా రోడ్డులోని ఓ కళాశాల హాస్టల్‌లో ఓ విద్యార్థిని గర్భం దాల్చి, బిడ్డకు జన్మనిచ్చినా.. గుర్తించలేని దుస్థితిలో పర్యవేక్షణ ఉంది.
- జూట్ మిల్ సమీపంలోని మరో కళాశాల వసతి గృహంలోని ఒక విద్యార్థినిని వైసీపీ పాలనలో ఓ నాయకుడి అనుచరులు మాయ మాటలు చెప్పి కిడ్నాప్ చేశారు. నగరంలోని రాజీవ్ స్వగృహ నివాసాల్లో ఉంచి రెండు రోజులు వేధించారు.
- నగరం నడిబొడ్డున ఒక వసతి గృహంలో వంట సరిగా లేక.. విద్యార్థులు సమీపంలోని అన్న క్యాంటీన్‌కి వెళ్లి భోజనం చేశారు. ఈ విషయం అసిస్టెంట్ సోషల్ వెల్ఫేర్ ఆఫీసర్ గతం డీడీకి నివేదించినా.. పట్టించుకో లేదు.
- మరోవైపు హెచ్‌డబ్ల్యూఓలు పెట్టే బిల్లుల్లో కూడా కమిషన్లు వసూలు చేస్తున్నట్లు ఫిర్యాదులు ఉన్నాయి కొంతమంది అధికారులు ప్రొటోకాల్ పేరుతో భారీ మొత్తంలో వసూళ్లు చేసిన ఘటనలున్నాయి.
- కొంతమంది హాస్టల్ వెల్ఫేర్ ఆఫీసర్లపై విజిలెన్స్ విచారణ ఉన్న పట్టించుకోవడం లేదని, పూర్తిస్థాయిలో దర్యాప్తు జరపడం లేదని విమర్శలున్నాయి.
- తాజాగా నగరంలోని ఓ కళాశాల హాస్టల్ నుంచి ఓ విద్యార్థిని అదృశ్యమైనట్లు ఫిర్యాదులు ఉన్నాయి. ఈ విషయం గోప్యంగా ఉంచి సదరు అధికారులు దర్యాప్తు చేస్తున్నారు.ఇలా సాంఘిక సంక్షేమ శాఖ గత అధికారుల హయాంలో గాడి తప్పింది. నూతనంగా వచ్చిన అధికారి అయిన శాఖను గాడిలో పెడతారా? లేదా అని విద్యార్థులు వారి తల్లిదండ్రులు సిబ్బంది ఎదురుచూస్తున్నారు.

ఉప్పొంగిన వాగులు..నిలిచిన రాకపోకలు

నాదెండ్ల, జూలై 22 (ఆంధ్రజ్యోతి): మండలంలోని పలు గ్రామాల్లో సోమవారం సాయంత్రం కురిసిన భారీ వర్షంతో వాగులు పొంగి ప్రవహించాయి. సుమారు మూడు గంటల పాటు ఎడతెరపి లేని వానతోపాటు ఎగువ ప్రాంతాల నుంచి కూడా వరద నీరు రావడంతో గణపవరం శివప్రియ నగర్ మార్గ మధ్యలో ఉన్న కుప్పగంజి వాగు చప్టాపై నుంచి వర్షపు నీరు ప్రవహించింది. ఈ క్రమంలో మంగళవారం ఉదయం వరకు రాకపోకలు నిలిచిపోయాయి. చప్టా ప్రాంతాన్ని తహసీల్దార్ చంద్రశేఖర్, ఎస్ఐ పుల్లారావు సందర్శించి బందోబస్తు ఏర్పాటు చేయించారు. తూముల వద్ద ఇరుక్కుపోయిన నాచు, గడ్డి, చెత్తా చెదారాన్ని పంచాయతీ సిబ్బంది పొక్లెయినర్‌తో తొలగించారు. అదే విధంగా నాదెండ్ల, తూబాడు గ్రామాల మధ్య ఉన్న దంతెల వాగు ఉప్పొంగడంతో.. ఉదయం వరకు రాకపోకలు నిలిచి పోయాయి. లోతట్టు ప్రాంతాలు జలమయంగా మారాయి.



గణపవరం వద్ద ఉధృతంగా ప్రవహిస్తున్న కుప్పగంజి వాగు

అనుసంధానం మొదలు

(5వ పేజీ తరువాయి)

నిర్మాణంతో పాటు ఇక్కడే నిర్మిస్తున్న ఫ్లైఓవర్ పనులు ఇంకా కొంతమేర పెండింగులో ఉన్నాయి. దీంతోపాటు కృష్ణాయపాలెం, కురగల్లు ఈ-11 రోడ్డు సమీపంలో కొండవీటివాగు రిజర్వాయర్ వద్ద నిర్మిస్తున్న బ్రిడ్జి పనులు కూడా జాప్యానికి మరో కారణం. ఈ పనులు కూడా ప్రస్తుతం చివరి దశలో ఉన్నాయి. కాగా ఈ-10 రోడ్డు వద్ద అప్రోచ్ రోడ్డు పనులు జరుగుతున్నాయి. దీంతో పాటు గుంటూరు- విజయవాడ రైల్వే లైనుపై మంగళగిరి, చినకాకాని సమీపంలో నిర్మించే ఆర్వోబీ కూడా పూర్తయింది. సేఫ్టీ వాల్ నిర్మాణ పనులు తుది దశకు చేరాయి.

కాజ జంక్షన్ వద్ద అనుసంధాన పనులు

కాజ - చినకాకాని సరిహద్దుల్లో వెస్ట్ బైపాస్ అనుసంధానించడం కోసం ఎన్‌హెచ్- 16 మీద రాకపోకలను సర్వీసు రోడ్డులోకి మళ్లించారు. కాజ జంక్షన్ వద్ద వెస్ట్ బైపాస్ ఎంట్రన్స్‌లో పెద్ద ఆర్చి నిర్మాణాన్ని ఏర్పాటు చేసి సైన్ బోర్డులను ఏర్పాటు చేస్తున్నారు. చిలకలూరిపేట వద్ద నిర్మించిన బైపాస్‌ను ఎన్‌హెచ్- 16లో అనుసంధానించిన విధంగానే కాజ వద్ద కూడా రెండు రోడ్ల అనుసంధానం ఉంటుందని ఎన్‌హెచ్ఏఐ అధికారులు చెబుతున్నారు. కాగా సెప్టెంబరు చివరి నాటికి వెస్ట్ బైపాస్ పూర్తిస్థాయిలో అందుబాటులోకి వస్తుందని వారు స్పష్టం చేశారు.

‘మాచర్ల’ సమగ్రాభివృద్ధికి మాస్టర్‌ప్లాన్

(5వ పేజీ తరువాయి)

చర్చించనున్నారు. వారి ఆమోదంతో జోన్స్‌పై ప్రజల నుంచి అభ్యంతరాలు స్వీకరిస్తారు. ఈ మేరకు మార్పులు చేపట్టి మాస్టర్ ప్లాన్ తయారు చేయనున్నట్లు మున్సిపల్ కమిషనర్ వేణుబాబు తెలిపారు.

జేజేఎం శంకుస్థాపన పనులపై సమీక్ష

మాచర్ల నియోజకవర్గం విజయపురిసౌత్ వద్ద రూ.1,200 కోట్లతో నిర్మించనున్న జలజీవన్ మిషన్ శంకుస్థాపన పనులు త్వరలోనే జరగనున్నాయి. ఈ కార్యక్రమానికి డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ రానున్న నేపథ్యంలో ఆర్‌డబ్ల్యూఎస్, పంచాయతీరాజ్, అటవీ శాఖ, విద్యుత్ శాఖ అధికారులతో ఎమ్మెల్యే జూలకంటి సమీక్ష నిర్వహించారు. గిరిజన రైతులు సేద్యం చేసుకుంటున్న అటవీ భూములకు పట్టాలిచ్చే కార్యక్రమం, వివిధ తండాలకు రోడ్డు మార్గాలు, విద్యుత్ సదుపాయం, ప్రత్యేక ఎస్టీ పంచాయతీలు ఏర్పాటుపై అధికారులతో సమీక్షించి సమగ్ర నివేదికతయారు చేయాలని సూచించారు.

రైలు కింద పడి యువతి ఆత్మహత్య

సత్తెనపల్లి రూరల్, జూలై 22 (ఆంధ్రజ్యోతి) : రైలు కింద పడి యువతి ఆత్మహత్య చేసుకున్న ఘటన మండలంలోని వెన్నాదేవి వద్ద గల రైల్వే గేటు సమీపంలో మంగళవారం రాత్రి జరిగింది. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం సుమారు 19 ఏళ్ల వయస్సు గల యువతి సాయంత్రం 7 గంటల సమయంలో రైల్వే ట్రాక్‌పై నడుచుకుంటూ వెళ్లింది. తాము ఎంత వారించినా యువతి పట్టాల పైనే నడుచుకుంటూ వెళ్లిందని స్థానికులు తెలిపారు. ఆ సమయంలో విజయవాడ నుంచి సికిందరాబాద్ వెళ్తున్న రాజధాని ఎక్స్‌ప్రెస్ ఢీకొట్టడంతో యువతి అక్కడికక్కడే మృతి చెందింది. ఐతే యువతి అక్క బావలు కొద్ది నెలల నుంచి వెన్నాదేవిలో నివాసం ఉంటున్నట్టు, అక్క కోసం వచ్చిన యువతి ఇలా రైలు కింద పడి ఆత్మహత్య చేసుకున్నట్టు సమాచారం. యువతిది బెల్లంకొండ మండలం గంగిరెడ్డిపాలెం గ్రామంగా తెలిసింది. యువతి మృత దేహాన్ని కుటుంబ సభ్యులు తీసుకెళ్లారు. ఆత్మహత్యకు గల కారణాలు తెలియరాలేదు.

అధికారం శాశ్వతమన్న భ్రమతో రాష్ట్రం లూటీ : ప్రత్తిపాటి

చిలకలూరిపేట, జూలై 22 (ఆంధ్రజ్యోతి): మూలవిరాట్టు చిక్కితేనే మద్యం కుంభకోణం విచారణకు తెరపడుతుందని, పసుపు కుంకుమలు పోగొట్టుకొన్న ఎంతో మంది ఆడబిడ్డలకు న్యాయం జరుగుతుందని చిలకలూరిపేట ఎమ్మెల్యే ప్రత్తిపాటి పుల్లారావు మంగళవారం ఓ ప్రకటనలో పేర్కొన్నారు. దశలవారీ మద్య నిషేధమని చెప్పి దశలవారీ ప్రణాళికతో రూ.వేలకోట్లు కొల్లగొట్టారని ఆయన విమర్శించారు. అధికారం శాశ్వతమన్న భ్రమతో అడ్డగోలుగా రాష్ట్రాన్ని లూటీ చేశారని దుయ్యబట్టారు. సాక్ష్యాలు, ఆధారాలు రూపుమాపామని, ఎప్పటికీ దొరకమని ఆనందించారని, కూటమి ప్రభుత్వ రాకతో వైసీపీ అవినీతి, దోపిడీ పుట్టలు బద్దలయ్యాయన్నారు. సీఎం చంద్రబాబు నిష్పక్షపాత విధానాలు, సిట్ సమగ్ర విచారణతో మద్యం దొంగలు వరుసగా చెరసాలబాట పడుతున్నారని పేర్కొన్నారు. వైసీపీ నేతలు ఇప్పటికైనా రెడ్ బుక్ రాజ్యాంగం, కక్షసాధింపులు అనడం మానేసి, చట్టప్రకారం నడుచుకొని తమ సచ్ఛీలతను నిరూపించుకోవాలన్నారు.

నెక్ సూచించిన కోడిగుడ్ల ధర

● విజయవాడ జోన్ ప్లాస్టిక్ ట్రేలో సరఫరా చేసే ఫారం గేటు గుడ్డు ధర రూ.5.05 ● నెక్ విజయవాడ ఆఫీస్ ఫోన్: 74165 82559

బ్రాయిలర్ ధరలు

అమరావతి పౌల్ట్రీ ఫార్మర్స్ & ట్రేడర్స్ వెల్ఫేర్ అసోసియేషన్

బ్రాయిలర్ బర్డ్ (కిలో)	121, 129, 140
చికెన్ విత్ స్కిన్(కిలో)	228.00
చికెన్ స్కిన్ లెస్(కిలో)	238.00

51,209 మిర్చి టిక్కీల అమ్మకం

గుంటూరు, జూలై 22 (ఆంధ్రజ్యోతి): మిర్చియార్డుకు మంగళవారం 52,273 మిర్చి టిక్కీలు విక్రయానికి రాగా ముందురోజు నిల్వ ఉన్న వాటితో కలిపి 51,209 అమ్మకం జరిగినట్లు గుంటూరు వ్యవసాయ మార్కెట్ కమిటీ ఉన్నతశ్రేణి కార్యదర్శి ఏ చంద్రిక తెలిపారు. ఇంకా యార్డు ఆవరణలో 7,316 మిర్చి టిక్కీలు నిల్వ ఉన్నట్లు పేర్కొన్నారు. వివిధ రకాల మిరపకాయలకు ధరలు ఈ కింది విధంగా నమోదయ్యాయి.

వెరైటీ	కనిష్ఠధర	గరిష్ఠధర
నాన్ ఏసీ కామన్ వెరైటీ		
334	9500	13000
నెంబరు. 5	10000	13400
273	9800	12800
341	10000	13500
4884	----	----
సూపర్ 10	----	----
నాన్ ఏసీ స్పెషల్ వెరైటీ		
తేజ	10000	14000
షార్క్-1	-----	----
బ్యాడిగి	10000	12400
దేవనూరు డీలక్స్	10000	12500

వెరైటీ	కనిష్ఠధర	గరిష్ఠధర
ఆర్మూరు	9600	11000
ఏసీ కామన్ వెరైటీ		
334	9500	12500
నెంబరు. 5	10000	13600
273	---	---
341	10000	13600
4884	10000	12700
ఏసీ స్పెషల్ వెరైటీ		
తేజ	10000	13800
బ్యాడిగి	10000	12500
దేవనూరు డీలక్స్	10000	12600
తాలుకాయలు	4500	7000

ఒకటో తేదీ నుంచి నిత్యావసరాలు పంపిణీ చేయాలి

ముప్పాళ్ళ జూలై 22(ఆంధ్రజ్యోతి): మండలంలోని రేషన్ డీలర్లందరూ ప్రజలకు ఒకటో తేదీ నుంచి నిత్యావసర సరుకులను పంపిణీ చేయాలని తహసీల్దార్ నగేష్ అన్నారు. తహసీల్దార్ కార్యాలయంలో మంగళవారం రేషన్ డీలర్ల సమావేశం నిర్వహించారు. సమావేశంలో తహసీల్దార్ మాట్లాడుతూ ప్రతినెల 26వ తేదీ నుంచి 30వ తేదీ వరకూ దివ్యాంగులకూ, వృద్ధులకు, 65 సంవత్సరాలు పైబడినవారికి ఇంటికి వెళ్లి నిత్యావసర సరుకులను పంపిణీ చేయాలన్నారు. కార్యక్రమంలో డీటీ బాలవెంకటేష్, డీలర్లు పాల్గొన్నారు.



టీడీపీ కేంద్ర కార్యాలయంలో మంగళవారం గన్నవరం ఎమ్మెల్యే యార్లగడ్డ వెంకటరావు, మాజీ ఎమ్మెల్సీ అశోక్‌బాబులను కలిసిన ఎమ్మెల్యే భాష్యం ప్రవీణ్

(పెదకూరపాడు)

ఇంజనీరింగ్ కార్మికుల భిక్షాటన

పిడుగురాళ్ల, జూలై 22 (ఆంధ్రజ్యోతి): మున్సిపల్ పారిశుధ్య, ఇంజనీరింగ్ కార్మికుల రాష్ట్ర వ్యాప్త సమ్మెలో భాగంగా మంగళవారం పట్టణంలో భిక్షాటన నిర్వహించారు. పది రోజులుగా సమ్మె చేస్తున్న కార్మికుల సమస్యలను తీర్చడంలో ప్రభుత్వం కాలయాపన చేస్తుందని సీఐటీయూ నాయకులు తెలగపల్లి శ్రీను తెలిపారు. మున్సిపల్ కార్మికుల సమ్మెను ముఖ్యమంత్రితో చర్చించి అమలు చేస్తామని మంత్రి నారాయణ హామీ ఇవ్వడంతో సమ్మెను తాత్కాలికంగా వాయిదా వేస్తున్నట్లు తెలిపారు.

గృహంలో చోరీ

మాచర్లటౌన్, జూలై 22 (ఆంధ్రజ్యోతి): తాళాలు వేసి ఉన్న గృహంలో చోరీ జరిగిన సంఘటన మాచర్ల పట్టణంలో సోమవారం రాత్రి జరిగింది. పట్టణంలోని సుద్దగుంతల 2వ లైన్‌కు చెందిన బచ్చు వేణుగోపాలరావు ఈనెల 16వ తేదీన గురజాలలో నివాసముంటున్న తన కుమార్తె వద్దకు వెళ్లారు. కాగా మంగళవారం ఉదయం ఇంటి తలుపులకు ఉన్న తాళాలు పగులకొట్టి ఉండడాన్ని గమనించిన చుట్టుపక్కల వారు వేణుగోపాలరావు ఫోన్ చేశారు. వేణుగోపాలరావు ఇంటికి వచ్చి చూడగా బీరువా తాళాలు పగులకొట్టి ఉన్నట్లు గుర్తించారు. బీరువాలోని వెండి కంచం, గ్లాసులు, పట్టీలు, బొమ్మలు అపహరణకు గురైనట్లు గుర్తించారు. వీటి విలువ సుమారు రూ.2 లక్షలు ఉంటుందని బాధితుడు ఆవేదన వ్యక్తం చేశారు. దీనిపై పట్టణ పోలీస్‌స్టేషన్లో ఫిర్యాదు చేశారు. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

సీజనల్ వ్యాధులపై అవగాహన ర్యాలీ

కారంపూడి, జూలై 22 (ఆంధ్రజ్యోతి): మండలంలోని ఒప్పిచర్లలో మంగళవారం వైద్య సిబ్బంది వర్షాకాల సీజనల్ వ్యాధులపై అవగాహన కల్పిస్తూ గ్రామంలో ర్యాలీ జరిపారు. గ్రామంలోని ఎస్టీ కాలనీలో ఐఆర్‌ఎస్ స్ప్రేయింగ్ చేశారు. దోమ కాటు ద్వారా వచ్చే వ్యాధులపై ప్రజల్లో అవగాహన కల్పించారు.

అదనపు ఆర్టీసీ బస్సులు వేయాలి

● టీడీపీ నాయకుల వినతి

అచ్చంపేట, జూలై 22 (ఆంధ్రజ్యోతి) : సత్తెనపల్లి నుంచి మాదిపాడు వరకు ప్రయాణికుల రద్దీ అదనంగా ఉన్న నేపథ్యంలో ఆర్టీసీ బస్సు అదనంగా నడపాలని మండల టీడీపీ నాయకులు మంగళవారం సత్తెనపల్లి డిపో మేనేజరు విజయకుమార్‌కు వినతిపత్రం అందించారు. మూడు జిల్లాలకు ప్రధాన కూడలి ఐన మాదిపాడు వరకు బస్సు ట్రిప్పులు పెంచాలని వారు కోరారు. వినతి పత్రం అందించిన వారిలో టీడీపీ నాయకులు గంధం కోటేశ్వరరావు, డీసీ ఛైర్మన్ పసుపులేటి పాపిరెడ్డి, బీసీ నాయకులు తిరువాయిపాటి అంజనేయులు పాల్గొన్నారు.

గ్రంథాలయ నిర్మాణానికి స్థల పరిశీలన

నకరికల్లు, జూలై 22(ఆంధ్రజ్యోతి): మండలంలోని కండ్లకుంటలో గ్రంథాలయం నిర్మాణానికి పారిశ్రామికవేత్త రావెల సత్యనారాయణ ముందుకు వచ్చారు. గ్రంథాలయ సంస్థ ఛైర్మన్ గోనుగుంట్ల కోటేశ్వరరావు స్థల పరిశీలన చేశారు. గ్రంథాలయ భవన నిర్మాణానికి రావుల సత్యనారాయణ పూర్తిస్థాయిలో ఆర్థిక సహకారం అందించటంపై గోనుగుంట్ల అభినందనలు తెలిపారు. త్వరలో గ్రంథాలయ భవన నిర్మాణాన్ని ప్రారంభించనున్నట్టు సత్యనారాయణ తెలిపారు. స్థలంలో మెరక తోలి స్థలాన్ని చదును చేశారు.

క్రోసూరు ఏడీఏగా మస్తానమ్మ

క్రోసూరు, జూలై 22 (ఆంధ్రజ్యోతి): క్రోసూరు ఏడీఏగా వీ మస్తానమ్మ మంగళవారం బాధ్యతలు స్వీకరించారు. ఆమె నరసరావుపేట రూరల్ ఏడీఏగా పని చేస్తూ బదిలీపై ఇక్కడకు వచ్చారు. ఇప్పటి వరకు ఏడీఏగా ఇక్కడ సుదీర్ఘ కాలం పని చేసిన వీ హనుమంతరావు నరసరావుపేట జిల్లా వ్యవసాయ కార్యాలయానికి బదిలీ అయ్యారు. వ్యవసాయ సబ్ డివిజన్ పరిధిలోని ఐదు మండలాల్లో రైతులకు తక్షణ సేవలు అందించేందుకు కృషి చేస్తానని ఆమె తెలిపారు.

ఆన్‌లైన్ విధానంలో ఇంటి పన్ను

నకరికల్లు, జూలై 22 (ఆంధ్రజ్యోతి) : ఇంటి పన్నుల్లో అవకతవకలను నివారించేందుకు ప్రభుత్వం స్వర్ణ పంచాయతీల ద్వారా ఆన్‌లైన్‌లో ఇంటి పన్ను విధానాన్ని అమల్లోకి తెచ్చిందని అమరావతి డిప్యూటీ ఎండీవో కొల్లిపర పద్మజ తెలిపారు. నకరికల్లు మండలంలో పది వేల చదరపు అడుగులకు పైగా ఉన్న 28 అంశాలకు సంబంధించి ఆమె పరిశీలన చేశారు. నరసింగపాడు, గుండ్లపల్లి, నకరికల్లు, చల్లగుండ్ల, కుంకలగుంట్ల, దేచవరం, రూపెనగుంట్ల గ్రామాల్లో ఇలాంటి అంశాలు ఉన్నట్టు గుర్తించారు. పొరపాట్లను గుర్తించి సవరణకు అవసరమైన చర్యలను చేపడుతున్నట్టు ఆమె వివరించారు. ఆమెతో పాటు నకరికల్లు డిప్యూటీ ఎంపీడీవో కేవీఎస్ ప్రసాదు, పీఎస్‌లు కొమ్మవరపు అప్పారావు, బీ దుర్గారావులు ఉన్నారు.

రోడ్డు విస్తరణ సరే.. లో లెవల్ చప్టా విస్తరణ ఏది?

దాచేపల్లి, జూలై 22 (ఆంధ్రజ్యోతి) : కోట్ల రూపాయలతో రోడ్డు విస్తరణ పనులు జరుగుతున్నా రోడ్డు పై ఉన్న లోలెవల్ చప్టాల నిర్మాణాలపై దృష్టి సారించక పోవటం ఏంటని? గ్రామస్థులు ప్రశ్నిస్తున్నారు. వివరాల్లోకి వెళితే దాచేపల్లి నగర పంచాయతీ నారాయణపురం ఆర్‌అండ్‌బీ బంగ్లా సెంటర్ నుంచి నడికూడి గ్రామ పంచాయతీ కార్యాలయం వరకు రోడ్డు విస్తరణ పనులు చేపట్టారు. ఈ పని కోసం కోట్ల రూపాయల నిధులను మంజూరు చేశారు. రోడ్డు పై తారు రోడ్డు నిర్మాణం పూర్తి చేశారు. రోడ్డుకు ఇరువైపులా గ్రావెల్‌తో చదును చేశారు. కానీ చిన్న పాటి వర్షం కురిసినా, నల్లవాగు ఉధృతంగా ప్రవహించినా లో లెవల్ చప్టాపై నుంచి వర్షపు నీరు ఉధృతంగా ప్రవహిస్తుంది. దీంతో రాకపోకలకు ఆటంకం ఏర్పడుతుంది. ప్రజలు వర్షం కురిస్తే నల్లవాగు ప్రవాహానికి భయపడి మరో మార్గంలో నుంచి



నడికూడి రైల్వేస్టేషన్ నుంచి నడికూడి గ్రామం మధ్యలో ఉన్న రహదారిపై జరుగుతున్న రోడ్డు విస్తరణ పనులు



నడికూడి గ్రామ పంచాయతీ రైల్వే స్టేషన్ మార్గంలో ఉన్న లో లెవల్ చప్టా మీదుగా ప్రవహిస్తున్న నల్లవాగు

ప్రయాణం చేస్తుంటారు. ఈ రహదారి నుంచి నడికూడి రైల్వే జంక్షన్‌లో దిగిన ప్రయాణికులు వర్షాకాలం వచ్చిందంటే కిలో మీటరు దూరం చుట్టూ తిరిగి గమ్య స్థానాలకు చేరుకోవాల్సి ఉంటుంది. ఇన్ని కోట్ల రూపాయల నిధులతో రోడ్డు విస్తరణ పనులు చేపట్టిన అధికారులు లోలెవల్ చప్టాల అభివృద్ధిపై దృష్టి సారించక పోవటం ఏంటని? ప్రశ్నలు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా అధికారులు లోలెవల్ చప్టాల ఎత్తు పెంచి ప్రయాణికులను కష్టాల నుంచి గట్టెక్కించాలని కోరుతున్నారు.

క్యాన్సర్‌తో బాధపడుతున్న చిన్నారికి ఆర్థికసాయం



అమర్‌నాథ్‌కు ఆర్థికసాయం అందజేస్తున్న గౌతమ్‌రెడ్డి, చంటి అండ్ ఫ్రెండ్స్ సర్కిల్

మాచర్లటౌన్, జూలై 22 (ఆంధ్రజ్యోతి): ఫోర్త్ స్టేజ్ క్యాన్సర్‌తో బాధపడుతున్న చిన్నారికి కంభంపాటి చంటి అండ్ ఫ్రెండ్స్ సర్కిల్ బాసటగా నిలిచారు. దాచేపల్లికి చెందిన నాళం అమర్‌నాథ్ కుమార్తె కీర్తి కొంత కాలంగా క్యాన్సర్‌తో బాధపడుతోంది. పేదరికంలో వైద్య ఖర్చులకు డబ్బుల్లేక ఇబ్బందులు పడుతున్నారని సామాజిక మాధ్యమాల్లో వచ్చిన సందేశం ద్వారా తెలుసుకొని చిన్నారి ప్రాణాలు కాపాడేందుకు ముందుకు వచ్చారు. దాతల ద్వారా సేకరించిన రూ.1.50 లక్షలను అమర్‌నాథ్‌కు ఎమ్మెల్యే జూలకంటి బ్రహ్మానందరెడ్డి కుమారుడు గౌతమ్‌రెడ్డి, టీడీపీ యువనేత అక్కిరెడ్డి చేతుల మీదుగా మంగళవారం పట్టణంలోని పత్తి ఫ్యాక్టరీలో గల వర్షిత ఫ్యాషన్‌లో అందజేశారు. పాప వైద్య ఖర్చుల నిమిత్తం తనవంతు ఆర్థికసాయం అందిస్తానని హామీనిచ్చారు. వైద్యఖర్చుల నిమిత్తం దాతలు ముందుకు వచ్చి చిన్నారి ప్రాణాలు కాపాడాలని చంటి కోరారు. ఆర్థిక సాయం చేయదలచిన వారు 8143617323, 9611080311లను సంప్రదించాలన్నారు.

మాజీ మంత్రి అంబటికి కూటమి నేతల హెచ్చరిక



టీడీపీ ప్రజావేదికలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న కూటమి నేతలు

సత్తెనపల్లి, జూలై 22 (ఆంధ్రజ్యోతి): మాజీ మంత్రి అంబటి రాంబాబు ఎమ్మెల్యే కన్నా లక్ష్మీనారాయణపై, ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడుపై, మంత్రి లోకేశ్‌పై ఆరోపణలు చేస్తే తాట తీస్తామని కూటమి నేతలు హెచ్చరించారు మంగళవారం టీడీపీ ప్రజావేదికలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో నాయకులు మాట్లాడుతూ అంబటి చేసిన ఆరోపణలు ఒక్కటైనా నిరూపించే దమ్ముందా? అన్నారు. అంబటి రాంబాబు సీఎం సహాయనిధి చెక్కుల్లో కూడా కమిషన్లు తీసుకున్న కక్కుర్తి వ్యక్తి అన్నారు. నియోజకవర్గంలో జగనన్న లే అవుట్‌ల పేరుతో జరిగిన భూ కొనుగోలులో అంబటి వైసీపీ నాయకులు దోచుకున్నారన్నారు. నామినేటెడ్ పదవులను రేటు కట్టి అమ్ముకున్న అంబటి కూటమి నేతలపై విమర్శలు చేస్తే సహించేది లేదన్నారు. దరువూరి నాగేశ్వరరావును పర్సంటేజ్‌ల కోసం ఎంత ఇబ్బంది పెట్టావో ప్రజ లందరికీ తెలుసన్నారు.

● రాజుపాలెం, జూలై 22 (ఆంధ్రజ్యోతి): మాజీ మంత్రి అంబటి(సంబరాల) రాంబాబు అధికారంలో ఉన్న సమయంలో నియోజకవర్గంలో ఎన్నో అక్రమాలు జరిగాయని, దేవరంపాడు నేతి వెంకన్న సాక్షిగా దోచుకుని దాచుకున్నారని జనసేన పార్టీ మండల అధ్యక్షుడు, అనుపాలెం పీఏసీఎస్ నూతన అధ్యక్షుడు తోట నరసయ్య ఆరోపించారు. మంగళవారం రాజుపాలెంలోని జనసేన మండల కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో నరసయ్య మాట్లాడుతూ రాజకీయంగా సుదీర్ఘ అనుభవం ఉండి తను మంత్రిగా నిర్వహించిన శాఖలకు వన్నె తెచ్చిన గొప్ప నాయకుడు, ప్రస్తుత ఎమ్మెల్యే కన్నా లక్ష్మీ నారాయణ అని పేర్కొన్నారు. నీవు రెడ్డిగూడెం-రాజుపాలెం గ్రామాల మధ్య పొలం ఎంత అక్రమించావు? ఆ పొలంలో నీవు ఐదు సంవత్సరాలు ఏం చేశావు? అనేది మండల ప్రజలకు తెలుసన్నారు. నీవు కూడా కన్నా లక్ష్మీనారాయణ గురించి మాట్లాడుతుంటే దెయ్యాలు వేదాలు వల్లించినట్లు ఉందన్నారు.

నాసిరకం మద్యంతో వేలాది మంది ప్రాణాలు బలిగొన్న జగన్

● మార్కెట్ యార్డు మాజీ చైర్మన్ కాంద్రు కాశయ్య

క్రోసూరు, జూలై 22 (ఆంధ్రజ్యోతి) : ఐదు సంవత్సరాల పాటు నాసిరకం మద్యం విక్రయించటం ద్వారా వేలాది మంది ప్రాణాలను మాజీ ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డి బలి గొన్నారని మార్కెట్ యార్డు మాజీ చైర్మన్ కాంద్రు కాశయ్య విమర్శించారు. పలువురు తెలుగుదేశం పార్టీ నాయకులతో కలసి మంగళవారం ఆయన విలేకరులతో మాట్లాడారు. ప్రజలకు నాసిరకం మద్యం సరఫరా చేసి డబ్బుతో పాటు వారి ఆరోగ్యాన్ని కూడా నాశనం చేసిన ఘనత వైసీపీ ప్రభుత్వానికే దక్కిందన్నారు. ఆనాడు ప్రతిపక్ష పార్టీగా అక్రమాల పై తాము పోరాడితే అక్రమ కేసులు బనాయించి అణచివేయాలని చూశారన్నారు. సిట్ దర్యాప్తుతో మద్యం కుంభకోణంలో అసలు వాస్తవాలు వెలుగులోకి వచ్చాయని అన్నారు. వైసీపీ ప్రభుత్వంలో జరిగిన స్కాంలన్నింటిపై విచారణ జరిపించాలని, బాధ్యులను కఠినంగా శిక్షించాలన్నారు. సమావేశంలో మాజీ ఎంపీపీ అనుముల వెంకటరామిరెడ్డి, మార్కెట్ యార్డు డైరెక్టర్ దుద్దుల యోహాన్, చెరువు నీటిసంఘం చైర్మన్ పరిశ రాంబాబు, నలజాల కోటేశ్వర రావు, మన్నెం శ్రీనివాసరావు, తదితరులు పాల్గొన్నారు.

మత్తు పదార్థాలకు బానిసలు కావద్దు : ఎస్ఐ

మాచవరం, జూలై 22 (ఆంధ్రజ్యోతి): మత్తు పదార్థాలకు, ధూమపానానికి, గుట్కా, ఖైనీలకు ఎవ్వరూ బానిసలు కావద్దని, దాని వల్ల కలిగే అనర్థాల గురించి ఎస్ఐ తిరుపతిరావు విద్యార్థులకు అవగాహన కల్పించారు. స్థానిక జీకే విద్యాసంస్థల్లో మత్తు పదార్థాలు, ధూమపానం నిషేధంపై విద్యార్థులకు అవగాహన కార్యక్రమాన్ని ఏర్పాటు చేశారు. కార్యక్రమానికి ఎస్ఐ తిరుపతిరావు ముఖ్యఅతిథిగా హాజరై నిషేధిత పదార్థాలను, వస్తువులను వినియోగించటం వల్ల కలిగే నష్టాల గురించి విద్యార్థులకు వివరించారు. ఈ అవగాహన కార్యక్రమంలో విద్యాసంస్థల ప్రిన్సిపాల్ శ్రీనివాసరావు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

ఐసీడీఎస్ కార్యాలయాన్ని క్రోసూరుకు తరలించాలి

● మానవ హక్కుల సంస్థ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి రాజేష్‌కుమార్

క్రోసూరు, జూలై 22 (ఆంధ్రజ్యోతి): అవినీతి మయమైన ఐసీడీఎస్ కార్యాలయాన్ని క్రోసూరుకు తరలించాలని రాష్ట్ర మానవ హక్కుల సంస్థ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సిర్రా రాజేష్‌కుమార్ మంగళవారం డిమాండ్ చేశారు. క్రోసూరు ఐసీడీఎస్ ప్రాజెక్టు కార్యాలయం 75 తాళ్ళూరులో ఉండటం శోచనీయం అన్నారు. ఐసీడీఎస్ కార్యాలయాన్ని క్రోసూరు కేంద్రంగా పేరు మార్చి రెండు సంవత్సరాలు కావస్తున్నా కార్యాలయం మార్చకపోవటం అధికారుల నిర్లక్ష్యానికి అద్దం పడు తుందన్నారు. 75 తాళ్ళూరులో ఉన్న కార్యాలయం శిథిలమై పోయి సిబ్బంది పనులు నిర్వహించటానికి అనుకూలంగా లేదన్నారు. అంతేగాక కొంత మంది అధికారులు అవినీతికి పాల్పడుతున్నారన్నారు. బిల్లుల్లో కూడా అవినీతి జరిగినట్టు వెలుగులోకి వచ్చినప్పటికీ ఇంతవరకు చర్యలు తీసుకోలేదన్నారు. తక్షణమే 75 తాళ్ళూరులో ఉన్న ఐసీడీఎస్ కార్యాలయాన్ని క్రోసూరుకు తరలించాలని ఆయన డిమాండ్ చేశారు. ఈ మేరకు క్రోసూరు తహసీల్దార్ వేముల నాగరాజుకు, ఎంపీడీవో రవికుమార్‌కు వినతిపత్రాలు సమర్పిస్తున్నట్టు తెలిపారు. కలెక్టర్‌కు, ఐసీడీఎస్ ప్రాజెక్టు అధికారికి, రాష్ట్ర కమిషనర్‌కు కూడా వినతిపత్రాలు పంపుతున్నట్టు తెలియ జేశారు.

ఇంటింట సంక్షేమ ఫలాలు.. అందరి ముఖాల్లో సంతోషాలు

పెదకూరపాడు, జూలై 22 (ఆంధ్రజ్యోతి): అందరి ముఖాల్లో సంతోషాలు ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు పాలన ద్వారానే సాధ్యమవుతుందని టీడీపీ మండల అధ్యక్షుడు ఏటుకూరి బ్రహ్మయ్య అన్నారు. పెదకూరపాడులో మంగళవారం ఇంటింటికి తిరుగుతూ కరపత్రాలను అందిస్తూ ప్రభుత్వం చేపట్టిన అభివృద్ధి, సంక్షేమ పథకాల గురించి ప్రజలకు వివరించారు. కార్యక్రమంలో మాజీ ఎంపీపీ గల్లా బాబూరావు తదితర నాయకులు పాల్గొన్నారు.

● అచ్చంపేట, జూలై 22 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని కోనూరు గ్రామంలో మంగళవారం సుపరిపాలన తొలి అడుగు కార్యక్రమం జరిగింది. కూటమి ప్రభుత్వం చేసిన అభివృద్ధి కార్యక్రమాలను వివరించినట్టు తెలుగుదేశం మండల పార్టీ అధ్యక్షుడు నందిగం ఆశీర్వాదం తెలిపారు. ఇంటింటికి వెళ్తూ కరపత్రాలను అందించారు. ఈ కార్యక్రమంలో యూనిట్ ఇన్‌చార్జ్ వాసిరెడ్డి రవిచందు, బూత్ కన్వీనర్ పోపూరి నాగరాజు, అరుణ్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

వేదోక్తంగా నవ చండీయాగం



చండీయాగంలో ఎమ్మెల్యే జూలకంటి, శోభారాణి దంపతులు

మాచర్ల రూరల్, జూలై 22 (ఆంధ్రజ్యోతి): మండలంలోని కొత్తపల్లి జంక్షన్ వద్ద గల ఎంఎస్‌ఆర్ టౌన్‌షిప్‌లో టౌన్‌షిప్ అధినేత మద్దిగపు శివరామిరెడ్డి (ఎంఎస్‌ఆర్) ఆధ్వర్యాన మంగళవారం నిర్వహించిన నవ చండీయాగ మహోత్సవం వేదోక్తంగా జరిగింది. ఎమ్మెల్యే జూలకంటి బ్రహ్మానందరెడ్డి, ఆయన సతీమణి శోభారాణి దంపతులు యాగ క్రతువులో పాల్గొన్నారు. ఎమ్మెల్యే దంపతులకు పూర్ణకుంభంతో స్వాగతం పలికారు. యాగశాలలో అమ్మవారికి ఎమ్మెల్యే జూలకంటి దంపతులు ప్రత్యేక పూజలు జరిపారు. కార్యక్రమంలో టీడీపీ నేతలు పంగులూరి పుల్లయ్య, మద్దిగపు వెంకట్రామిరెడ్డి, జూలకంటి అక్కిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

తెలుగుయువత అధ్యక్షుడిగా కోట జోసెఫ్



ఎమ్మెల్యే కన్నా లక్ష్మీనారాయణకు చిత్రపటాన్ని బహూకరిస్తున్న రాజుపాలెం మండల తెలుగుయువత నూతన అధ్యక్షుడు కోట జోసెఫ్

రాజుపాలెం, జూలై 22 (ఆంధ్రజ్యోతి): రాజుపాలెం మండల తెలు గుయువత నూతన అధ్యక్షుడిగా కొండమోడు గ్రామానికి చెందిన కోట జోసెఫ్ ఎంపికైయ్యారు. ఈ సందర్భంగా కోట జోసెఫ్ తన నియామకానికి కృషి చేసిన ఎమ్మెల్యే కన్నా లక్ష్మీనారాయణను కలిసి కృతజ్ఞతలు తెలిపారు. అనంతరం జోసెఫ్ మాట్లాడుతూ తనపై నమ్మకంతో తెలుగుయువత అధ్యక్ష పదవి రావటానికి కృషి చేసిన టీడీపీ మండల అధ్యక్షుడు అంచుల నరసింహారావుకు, మండల నాయకులకు ధన్యవాదాలు తెలియజేశారు. పార్టీ బలోపేతానికి కృషి చేస్తానని, రానున్న స్థానిక సంస్థల ఎన్నికల్లో పార్టీ అభ్యర్థుల విజయానికి తనవంతు కృషి చేస్తానన్నారు.

ఆక్రమణల తొలగింపు



22ఎస్‌పీఎల్1, ఆక్రమణలను తొలగిస్తున్న దృశ్యం

సత్తెనపల్లి, జూలై 22(ఆంధ్రజ్యోతి): పట్టణంలోని ప్రధాన రహదారిలో రోడ్లను ఆక్రమించి నిర్మించిన దుకాణాలను మంగళవారం టౌన్ ప్లానింగ్ అధికారుల, సిబ్బంది తొలగించారు. ఆక్రమణలు తొలగింపు సందర్భంగా కొందరు చిరు వ్యాపారులు సిబ్బందిపై దురుసుగా కూడా ప్రవర్తించారు. ఎంతో కాలంగా తాము వ్యాపారాలు చేసుకుంటుంటే తమ షాపులను తొలగించడం ఏంటని? ప్రశ్నించారు. ట్రాఫిక్‌కు అంతరాయంగా ఉన్న షాపులను తొలగించాల్సిందేనని, మున్సిపల్ నిబంధనలు పాటించాల్సిందేనని టౌన్ ప్లానింగ్ అధికారులు, సిబ్బంది తెలిపారు. ఆక్రమణదారుల షాపులు రోడ్డు పైకి వస్తే సహించేది లేదన్నారు.

రాజుపాలెం తహసీల్దార్‌గా సరోజ



తహసీల్దార్‌గా బాధ్యతలు స్వీకరించిన సరోజకు పుష్పగుచ్ఛం అందజేస్తున్న నర్రా బాబురావు, పెద్దిరాజు తదితరులు

రాజుపాలెం, జూలై 22(ఆంధ్రజ్యోతి): రాజుపాలెం తహసీల్దార్‌గా సరోజ మంగళవారం ఉద్యోగ బాధ్యతలు స్వీకరించారు. ఇప్పటి వరకు ఇక్కడ తహసీల్దార్‌గా ఉన్న దుర్గేశ్వరరావును సత్తెనపల్లిలోని ఆర్డీవో కార్యాలయానికి అక్కడ పని చేస్తున్న సరోజను రాజుపాలెంకు బదిలీ చేశారు. నూతన తహసీల్దార్‌గా బాధ్యతలు స్వీకరించిన సరోజకు టీడీపీ నాయకులు నర్రా బాబురావు, పెద్దిరాజు తదితరులు పుష్పగుచ్ఛం ఇచ్చి శుభాకాంక్షలు తెలిపారు.

ట్రాఫిక్‌కు అంతరాయం కలిగిస్తే ఉపేక్షించం

● పట్టణ సీఐ ప్రభాకరరావు

మాచర్లటౌన్, జూలై 22 (ఆంధ్రజ్యోతి): పట్టణ ప్రధాన రహదారిలో ట్రాఫిక్‌కు అంతరాయం కలిగిస్తే ఉపేక్షించేది లేదని పట్టణ సీఐ ప్రభాకరరావు హెచ్చరించారు. పట్టణంలోని ప్రధాన రహదారిలో తరచూ ట్రాఫిక్‌కు అంతరాయం కలుగుతుడడంతో మంగళవారం సీఐ ప్రభాకరరావు తన సిబ్బందితో కలిసి చర్యలు చేపట్టారు. ఆటోలు, తోపుడు బండ్లు రోడ్డుపైనే ఇరువైపులా నిలుపుదల చేయడం వంటివి గమనించి వారికి పలు సూచనలు చేశారు. రోడ్డు మార్జిన్ వెనుక స్థలాల్లో తోపుడు బండ్లు పెట్టుకోవాలని, ఆటోలు రోడ్లపై ఎక్కువ సమయం నిలుపకూడదని సూచించారు. ద్విచక్ర వాహన దారులు రోడ్డుపై పార్కింగ్ చేస్తే కేసులు నమోదు చేస్తామని హెచ్చరించారు.

వైసీపీ నేతలు నోరు అదుపులో పెట్టుకోవాలి

● 'సుపరిపాలన-తొలిఅడుగు'లో ఎమ్మెల్యే భాష్యం ప్రవీణ్



మల్లాదిలో ఇంటింటికి కరపత్రాలు అందజేస్తున్న ఎమ్మెల్యే భాష్యం ప్రవీణ్

అమరావతి, జూలై 22(ఆంధ్రజ్యోతి): వైసీపీ మాజీ ప్రజాపతినిధులు మతిభ్రమించి మాట్లాడుతున్నారని నోరు అదుపులో పెట్టుకోవాలని ఎమ్మెల్యే భాష్యం ప్రవీణ్ హెచ్చరించారు. మంగళవారం సాయంత్రం మండల పరిధిలోని మల్లాది గ్రామంలోని ఎస్సీ కాలనీలల్లో జరిగిన సుపరిపాలనలో తొలిఅడుగు కార్యక్రమంలో ఎమ్మెల్యే పాల్గొన్నారు. కాలనీవాసులు స్థానిక టీడీపీ నాయకులు ఘనస్వాగతం పలికారు. ఇంటింటికి తిరుగుతూ సమస్యలను తెలుసుకుంటూ ప్రభుత్వం అందజేస్తున్న సంక్షేమ కార్యక్రమాలు అందుతున్నాయో లేదో అడిగి తెలుసుకున్నారు. సంవత్సర పాలనలో జరిగిన అభివృద్ధి సంక్షేమంపై టీడీపీ ప్రచురించిన కరపత్రాలను పంపిణీ చేశారు. అనంతరం ప్రవీణ్ మాట్లాడుతూ వైసీపీ నాయకులకు జైలు భయం పట్టుకుందని మద్యం కుంభకోణం వైసీపీ మెడకు చుట్టుకుని పార్టీ కనుమరుగయ్యే సమయం ఆసన్నమైందన్నారు. గత ఐదు సంవత్సరాల వైసీపీ ప్రభుత్వం అవినీతికి పాల్పడి నాయకులు జైలు పాలవుతుంటే అధికారంలోకి వచ్చిన టీడీపీ ప్రభుత్వం అభివృద్ధి, సంక్షేమం వైపు పరుగులు తీస్తుందని ఎమ్మెల్యే అన్నారు. కార్యక్రమంలో టీడీపీ మండల అధ్యక్షుడు ఎం రాజా, బీ వెంకటేశ్వరరావు, నరుకుళ్లపాడు, మునగోడు పీఏసీఎస్ ఛైర్‌పర్సన్‌లు భాష్యం జగదీష్, నాగోతు నాగార్జున తదితరులు పాల్గొన్నారు,

విద్యార్థుల సామర్థ్యాన్ని పెంచేలా బోధన ఉండాలి

● డీఈవో చంద్రకళ



ఉపాధ్యాయులతో మాట్లాడుతున్న డీఈవో చంద్రకళ

పెదకూరపాడు, జూలై 22 (ఆంధ్రజ్యోతి) : విద్యార్థుల సామర్థ్యాలు పెరిగేలా బోధన ఉండాలని ఉపాధ్యాయులతో జిల్లా విద్యాశాఖ అధికారి ఎల్ చంద్రకళ అన్నారు. మండలంలోని 75 తాళ్ళూరు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలను మంగళవారం ఆమె సందర్శించారు. పాఠశాల ఆవరణ, వసతులు ఉండటం విద్యార్థుల భవిష్యత్తుకు ఒక వరమని ఆమె అన్నారు. పాఠశాలలోని అటల్ ల్యాబ్, ఒకేషనల్ ల్యాబ్, పీఎంశ్రీలో జరుగుతున్న లైబ్రరీ వర్క్, కిచెన్ గార్డెన్, తదితర పనులను పరిశీలించి త్వరగా పూర్తి చేయాలని అన్నారు. 10వ తరగతి విద్యార్థులపై ప్రత్యేక దృష్టి సారించి ఉత్తీర్ణత శాతం పెంచాలని ఉపాధ్యాయులతో అన్నారు. ఈ కార్యక్రమంలో ఏఎంవో పూర్ణచంద్రరరావు, ఎంఈవో - 2 సత్యనారాయణ, హెచ్‌ఎం అన్నపురెడ్డి శ్రీనివాసరెడ్డి, ఏఈ శ్రీనివాసరెడ్డి, శివ తదితరులు ఉన్నారు.

విజయపురిసౌత్‌లో సుపరిపాలన-తొలిఅడుగు

మాచర్ల రూరల్, జూలై 22 (ఆంధ్రజ్యోతి): మండలంలోని కొత్తపల్లిలో మంగళవారం ఎమ్మెల్యే జూలకంటి బ్రహ్మానందరెడ్డి తనయుడు, టీడీపీ యువనేత జూలకంటి గౌతమ్‌రెడ్డి ఆధ్వర్యాన సుపరిపాలనలో తొలిఅడుగు కార్యక్రమం నిర్వహించారు. ఇంటింటికి తిరిగి కూటమి ప్రభుత్వం ఏడాది పాలనలో చేసిన అభివృద్ధి, ప్రవేశపెట్టిన సంక్షేమ పథకాలపై వివరించారు. ప్రజల సమస్యలను తెలుసుకున్నారు. సమస్యలను పరిష్కరిస్తామని హామీనిచ్చారు. ఈ కార్యక్రమంలో జూలకంటి అక్కిరెడ్డి, చిరంజీవిరెడ్డి, మండల అధ్యక్షుడు నేరేటి వీరాస్వామి యాదవ్, గుండెబోయిన శ్రీను, కొండారెడ్డి, నాగేశ్వరరావు, జయరాజు, మూర్తి, శంకరరెడ్డి, మోహన్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ఆప్కాస్ కార్మికులకు సంక్షేమ పథకాలు వర్తింపజేయాలి

● సీఐటీయూ నేత సురేష్

మాచర్ల రూరల్, జూలై 22 (ఆంధ్రజ్యోతి): ఆప్కాస్ కింద పనిచేసే కార్మికులందరికీ ప్రభుత్వం అమలు చేసే సంక్షేమ కార్యక్రమాలను వర్తింపజేయాలని సీఐటీయూ నేత వై సురేష్ డిమాండ్ చేశారు. మున్సిపల్ ఔట్ సోర్సింగ్ కార్మికులను పర్మినెంట్ చేయాలని కోరుతూ సీఐటీయూ ఆధ్వర్యాన మున్సిపల్ కార్యాలయం ఎదురు ప్రధాన రహదారిపై మున్సిపాలిటి పరిధిలో ఆప్కాస్ కింద పనిచేసే కార్మికులు చేపట్టిన నిరవధిక సమ్మె మంగళవారానికి రెండో రోజుకు చేరింది. సమ్మె శిబిరం వద్ద సురేష్ మాట్లాడుతూ కార్మికులకు రిటైర్మెంట్ బెనిఫిట్స్, గ్రాట్యూటి అమలు చేయాలన్నారు. గత సమ్మెలో చేసిన ఒప్పందాలను వెంటనే అమలు చేయాలన్నారు. కార్యక్రమంలో సీఐటీయూ నేతలు వేముల వెంకట్రావు, వర్కర్స్ యూనియన్ నాయకులు కొమెర రమణ, కుమారి, అనసూర్య, సాగర్‌బాబు, దేవళ్ల రమణ, తదితరులు పాల్గొన్నారు.

కడకు కన్నీరైంది


కొండవాగు వరదతో చెరువులను తలపిస్తున్న జాలాది పంట పొలాలు

యడ్లపాడు, జూలై 22(ఆంధ్రజ్యోతి): తొలకరి.. సాగుకు ముందే ముఖం చాటేశా యి. దీంతో తొలి విడత నాటిన విత్తనాలు మొలకెత్తకుండానే బొగిలిపోయాయి. జూలై సగం గడిచినా వర్షాలు లేక డీలాపడిన రైతులు.. వాతావరణశాఖ చల్లని కబురుతో మరోసారి పొడిన దుక్కిలో విత్తనాలు వేసుకున్నారు. శుక్రవారం 28.8 మి.మీలు, ఆదివారం 14.2 మి.మీ వర్షపాతం నమోదైంది. దీంతో విత్తనం మొలక వస్తుందని ఆశించిన రైతుల ఆశలను సోమవారం కురిసిన 33 మి.మీల కుండపోత అడియాసలు చేసింది.


లింగారావుపాలెం వద్ద ఉధృతంగా ప్రవహిస్తున్న నక్కవాగు (తూర్పువాగు)

ఉధృతంగా ప్రవాహం

ఎగువ ప్రాంతాల్లో కురిసిన భారీ వర్షాల కారణంగా వాగులు ఉధృతంగా ప్రవహిస్తున్నాయి. మండలంలోని నక్కవాగుతో పాటు ఉప్పు వాగు కూడా వరద నీటితో నిండుగా ప్రవహిస్తున్నాయి. లింగారావుపాలెం పడమర వాగు పొంగడంతో వరద నీరు సొలస, చిరుమామిళ్ల రోడ్డుపై నుంచి ప్రవహించాయి. వరద నీరు గ్రామంలోకి వస్తుందేమోనని గ్రామస్తులు పొద్దుపోయే వరకు జాగారం చేశారు. వరుణుడు శాంతించడంతో ఉధృతి తగ్గుముఖం పట్టి.. గ్రామస్తులు ఊపిరి పీల్చుకున్నారు.

కొండ వరదతో మునకేసిన పొలాలు

ఎగువన కురిసిన వర్షాలకు తోడు కొండల పైనుంచి వచ్చిన ప్రవాహం తోడై లోతట్టు గ్రామాలైన జాలాది, తుర్లపాడు, గణేశునివారిపాలెం గ్రామాల పరిధిలోని పంట పొలాలు మునకేశాయి. దీంతో ఆయా గ్రామాల్లోని పొలాలకు గండ్లు పడడంతోపాటు, అప్పటికే వివిధ రకాల విత్తుకున్న విత్తనాలు మొలకెత్తకుండా పోయాయి. ఎటు చూసినా కనుచూపు మేరలో నీరే కనిపించడంతో రైతులకు కన్నీరే మిగిలింది.


యడ్లపాడు వద్ద ఉధృతంగా ప్రవహిస్తున్న ఉప్పువాగు


గాజుల్లంక-శ్రీకాకుళం తాత్కాలిక మార్గం తూముల కింద నుంచి ప్రవహిస్తున్న వరద నీరు

వరద ఉధృతి పెరిగితే మార్గం మాయం!

కొల్లూరు, జూలై 22 (ఆంధ్రజ్యోతి): కృష్ణానదిలో వరద నీరు ప్రవహిస్తోంది. ఇటీవల ప్రకాశం బ్యారేజీ ఎగువన కురిసిన వర్షాలతో బ్యారేజీ నీటి మట్టం 12 అడుగులు దాటడంతో దిగువకు మంగళవారం 10 వేల క్యూసెక్కుల వరద నీటిని విడుదల చేశారు. దీంతో కొల్లూరు మండలం సుగ్గునలంక, గాజుల్లంక గ్రామాల వద్దకు కృష్ణా నదిలో వరద నీరు సాయంత్రానికి చేరింది. గాజుల్లంక నుంచి శ్రీకాకుళం వెళ్లేందుకు నదిలో తాత్కాలికంగా ఏర్పాటు చేసిన గాలు మార్గం కింద తూముల నుంచి వరద నీరు ప్రవహిస్తోంది. 20 వేల క్యూసెక్కులు దిగువకు విడుదల చేస్తే ఈ తాత్కాలిక గాలు మార్గం వరద నీటి ఉధృతికి కొట్టుకుపోయే ఆస్కారం ఉంది. గత ఆరేడు నెలలుగా తాత్కాలిక మార్గం నుంచి ప్రజలు రాకపోకలు సాగిస్తున్నారు. వరద నీటితో మార్గం కొట్టుకుపోతే ద్విచక్ర వాహనదారులు పడవలను ఆశ్రయించాల్సి ఉంటుంది. ఇప్పటి వరకు లారీలు, నాలుగు చక్రాల వాహనాలు కూడా గాలు మార్గం ద్వారా కృష్ణా, బాపట్ల జిల్లాలకు రాకపోకలు సాగించాయి. మార్గం తెగిపోతే ఆయా వాహనాలు పెనుమూడి వారధి మీదుగా శ్రీకాకుళం, పామర్రు, గుడివాడ, మచిలీపట్నం ప్రాంతాలకు వెళ్లాల్సిన పరిస్థితి ఉంది. దీంతో దూరాభారం పెరుగుతుంది.

ఉప సంఘంలో..మంత్రులు
అనగాని, నాదెండ్ల

జిల్లాల సరిహద్దులు, పేర్ల మార్పులకు క్యాబినెట్ సబ్ కమిటీ

త్వరలో జిల్లాల్లో పర్యటించే అవకాశం

గుంటూరు, జూలై 22 (ఆంధ్రజ్యోతి): వైసీపీ ప్రభుత్వ హయాం లో అశాస్త్రీయంగా జరిగిన జిల్లాల పునిర్వభజనను సరి చేసేందుకు కూటమి ప్రభుత్వం నియమించిన మంత్రుల బృందంలో ఉమ్మడి గుంటూరు జిల్లా నుంచి ఇద్దరికి చోటు లభించింది. రాష్ట్ర రెవెన్యూ శాఖ మంత్రి అనగాని సత్యప్రసాదు, పౌరసరఫరాల శాఖ మంత్రి నాదెండ్ల మనోహర్ క్యాబినెట్ సబ్ కమిటీలో కీలక పాత్ర పోషిం చనున్నారు. కమిటీలో మొత్తం ఏడుగురు ఉండగా జిల్లా నుంచి ఇద్దరు ఉండటం విశేషం. ముఖ్యంగా పల్నాడు, బాపట్ల జిల్లాల్లో అసంబద్ధంగా రెవెన్యూ డివిజన్ల విభజన, కొత్తవి ఏర్పాటు జరి గాయి. గుంటూరు రెవెన్యూ డివిజన్ పరిధిలో ఉన్న కొన్ని మండ లాలను తీసుకెళ్లి తెనాలిలో కలిపారు. దీనిపై ఆయా మండలాల ప్రజలు అభ్యంతరాలు చెబుతున్నారు. లోక్‌సభ నియోజకవర్గం ప్రాతిపదికగా చేసుకొని జిల్లాల విభజన చేయడం సరికాదని అప్పట్లోనే ప్రజలు అసంతృప్తి వ్యక్తం చేశారు.

గతంలో ఇలా..

గత ప్రభుత్వం 2022 ఏప్రిల్ నెల మొదటి వారంలో జిల్లాల పునిర్వభజన చేసింది. ఉమ్మడి గుంటూరు జిల్లా కాస్త గుంటూరు, పల్నాడు, బాపట్ల జిల్లాలుగా విభజితమైంది. గుంటూరు జిల్లాని ఏడు అసెంబ్లీ నియోజకవర్గాలైన గుంటూరు తూర్పు, పశ్చిమ, పొన్నూరు, తెనాలి, మంగళగిరి, తాడికొండ, ప్రత్తిపాడుకు పరిమితం చేశారు. పల్నాడు జిల్లాని పెదకూరపాడు, సత్తెనపల్లి, నరసరావుపేట, వినుకొండ, మాచర్ల, చిలకలూరిపేట, గురజాలతో ఏర్పాటు చేశారు. బాపట్ల జిల్లాని బాపట్ల, వేమూరు, రేపల్లె, చీరా ల, పర్చూరు, సంతనూతలపాడు, అద్దంకితో కలిపి ఏర్పరిచారు. జిల్లాల విభజన కోసం రేపల్లె, సత్తెనపల్లిలో కొత్త డివిజన్‌లు నెలకొల్పారు. అయితే కొన్ని మండలాలు ఏర్పాటు చేసిన డివిజన్ హెడ్ క్వార్టర్స్‌కు దూరంగా ఉన్నాయి. మరోవైపు ఇతర డివిజ న్లకు దగ్గరగా ఉండటంతో ప్రజలు అసంతృప్తికి గురవుతున్నారు. అలానే ఒకే అసెంబ్లీ నియోజకవర్గంలో ఉన్న మండలాలు కొన్ని ఒక డివిజన్‌లో మరికొన్ని వేరే డివిజన్‌లో ఉండటంతో ప్రజాప్రతి నిధులు కూడా ఇబ్బందులు పడాల్సి వస్తోంది. బాపట్ల జిల్లా ఏర్పాటు విషయంలో అక్కడి ప్రజాప్రతినిధులు అనేక అభ్యంత రాలను అప్పట్లో లేవనెత్తారు. అయినప్పటికీ వైసీపీ ప్రభుత్వం అవేమి పట్టించుకోకుండా ముందుకు సాగింది.

అమరావతి జిల్లా ఏర్పాటుకు డిమాండ్

అమరావతి రాజధాని ప్రస్తుతం గుంటూరు జిల్లాలో ఉంది. అయితే ఇది గుంటూరు హెడ్ క్వార్టర్స్‌కు 35 కిలోమీటర్ల దూరం లో ఉండటంతో పరిపాలన పరంగా కొన్ని సమస్యలు తలెత్తుతు న్నాయి. ముఖ్యంగా సీఎం, డిప్యూటీ సీఎంతో పాటు మంత్రులు, సీనియర్ ఐఏఎస్ అధికారుల రాకపోకలు రాజధానిలో ఎక్కువగా ఉంటున్నాయి. రాష్ట్రస్థాయి ప్రజా ప్రతినిధులు, అధికారులు పా ల్గొనే సమావేశాలకు గుంటూరు జిల్లా కలెక్టర్, ఇతర అధికారులు ప్రొటోకాల్ పాటించాల్సి వస్తోంది. అలానే సభలు, సమావేశాల ఏర్పాట్లను కలెక్టర్, ఎస్పీ ఇతర అధికారులు చూసుకోవాలి. దీంతో ఇక్కడ పరిపాలనలో సమస్యలు ఉత్పన్నమవుతున్నాయి. ఈ నేపథ్యంలో అమరావతిని ప్రత్యేక జిల్లాగా ఏర్పాటు చేయాలన్న డిమాండ్ ఉంది. వీటన్నింటిపై మంత్రుల బృందం ఏ మేరకు చర్యలు తీసుకొంటుందో చూడాలి.

కందుల డబ్బులు ఎప్పుడు
ఏడతాయబ్బా..!

జిల్లా వ్యాప్తంగా పడుతున్న వర్షాలు

ఖరీఫ్ సాగు ఖర్చులకు రైతుల ఎదురుచూపులు

పిడుగురాళ్ల, జూలై 22 (ఆంధ్రజ్యోతి): కంది డబ్బులు కోసం రైతులు ఎదురు చూస్తున్నారు. ఆరుగాలం పంట దిగుబడి కోసం కష్టపడిన అన్నదాతలు.. ఇప్పుడు విక్రయించిన పంట నగదు కోసం దిగులు పెట్టుకున్నారు. గురజాల నియోజకవర్గంలో ఈ ఏడాది ఖరీఫ్, రబీలో కంది పంటను సుమారు 25 వేల ఎకరాలలో సాగు చేశారు. ఈ ఏడాది ఏప్రిల్ నుంచి మార్క్‌ఫెడ్ ద్వారా కంది కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేశారు. క్వింటాకు సుమారు రూ.7,500కు కొనుగోలు చేశారు. నెల తర్వాత జిల్లాకు ఇచ్చిన టార్గెట్‌ను మించిపోవడంతో నెలపాటు కొనుగోళ్లను నిలిపివేశారు. అప్పటికే రైతుల ఇళ్లకు గోనె సంచులు చేరడం, మరికొంత మందికి సంబంధించి కందులను తూకం వేయడంతో ఆందోళన వ్యక్తమైంది. మార్క్‌ఫెడ్ అధికారుల సూచనలతో రాష్ట్ర, కేంద్ర స్థాయి అధికారులు స్పందించి తిరిగి కొనుగోలు సామర్థ్యాన్ని పెంచారు. గత నెలలోనే మార్క్‌ఫెడ్ అధికారులు కందుల నిల్వలను కొనుగోలు చేశారు. గురజాల నియోజకవర్గం వ్యాప్తంగా సుమారు 150 మంది రైతుల ఖాతాలకు రూ.50 వేల నుంచి రూ.3 లక్షలు పైగా నగదు జమ కావాల్సి ఉంది.

నగదు జమ అయితే...

ప్రస్తుతం వర్షాలు పడుతున్నాయి. రైతులు వివిధ పంటల సాగుకు సన్నద్ధమవుతున్నారు. రైతులు పెట్టుబడి ఖర్చులకు బయటి వ్యక్తులు, బ్యాంక్‌లను ఆశ్రయించకుండా ఉండాలంటే.. కొనుగోలు చేసిన కందులకు వెంటనే నగదు జమ కావాలి. మార్క్‌ఫెడ్ అధికారులు స్పందించి కంది నగదును వెంటనే రైతుల ఖాతాలకే జమ అయ్యే విధంగా చూడాలని రైతులు కోరుతున్నారు.



రైతుల వద్ద కొనుగోలు చేసిన కందుల బస్తాలు

ఇప్పుడు ఎంతో అవసరం : కుర్రా కోటయ్య, రైతు



ప్రస్తుతం పంట సాగుకు చేతిలో డబ్బు ఎంతో అవసరం. కందులు విక్రయించినా నగదు జమ కాకపోవడంతో కాస్త ఆందోళనగా ఉంది. బయట వ్యక్తులను ఆశ్రయించాల్సిన అవసరం ఏర్పడేటట్లు ఉంది. ఇప్పుడు నగదు అందిస్తే అవసరానికి ఉపయోగపడతాయి.

మార్క్‌ఫెడ్ అధికారులు స్పందించాలి : ఆంజనేయులు, రైతు



కొనుగోలు చేసిన కందులకు నగదును వెంటనే జమచేసే విధంగా మార్క్‌ఫెడ్ అధికారులు స్పందించాలి. అధికారులను అడిగితే నగదు, బ్యాంక్ వివరాలను ప్రభుత్వానికి, బ్యాంక్‌లకు పంపించామని, త్వరలోనే నగదు జమ అవుతాయని చెబుతున్నారు.

453.32 కేజీల గంజాయి ధ్వంసం


పట్టుబడిన గంజాయితో ఎక్సైజ్ శాఖ అధికారులు

● గుంటూరు, పల్నాడు జిల్లాల్లో పట్టివేత

గుంటూరు కార్పొరేషన్, జూలై 22(ఆంధ్రజ్యోతి): గుంటూరు, పల్నాడు జిల్లాల్లోని వివిధ ఎక్సైజ్ పోలీస్ స్టేషన్లో పలు కేసుల్లో దొరికిన 453.32 కేజీల గంజాయిని యడ్లపాడు మండలం నాయుడుపేట డంపింగ్ యార్డ్ వద్ద ధ్వంసం చేసినట్లు మంగళవారం గుంటూరు ఎక్సైజ్ శాఖ డిప్యూటీ కమిషనర్ డాక్టర్ కె.శ్రీనివాసులు తెలిపారు. ఉన్నతాధికారుల సమక్షంలో గంజాయిని పూర్తిగా తగలబెట్టినట్లు చెప్పారు. ఈ కార్యక్రమంలో ఎక్సైజ్ శాఖ అధికారులు కుమార్ రెడ్డి, దయాసాగర్, సుధాకర్ రెడ్డి, పర్యావరణ ఇంజనీర్ నజీనా బేగం, అరుణ కుమారి, మణికంఠ పాల్గొన్నారు.

సెప్టెంబరు 29 నుంచి..
శబరి ప్రయాణ సమయం మార్పు

గుంటూరు, జూలై 22 (ఆంధ్రజ్యోతి): శబరి ఎక్స్‌ప్రెస్‌ని సూపర్ ఫాస్టుగా మారుస్తూ రైల్వేబోర్డు ఇటీవల నిర్ణయం తీసుకొన్న దృష్ట్యా సెప్టెంబరు 29 నుంచి ఈ రైలు ప్రయాణ సమయం మారిపోనుంది. 17229 తిరువనంతపురం - సికింద్రాబాద్ శబరి ఎక్స్‌ప్రెస్ 20630 నంబరుగా మారుతుంది. ఈ రైలు తిరువనంతపురంలో సాయంత్రం 6.45కి బయలుదేరి తిరుపతికి రాత్రి 11.15కి, చీరాలకు వేకువజామున 4.08, బాపట్లకు 4.23, నిడుబ్రోలుకు 4.58, తెనాలికి 5.28, గుంటూరుకు ఉదయం 6.20, సత్తెనపల్లికి 7.09, పిడుగురాళ్లకు 7.34, నడికుడికి 7.54, చర్లపల్లికి 10.29, సికింద్రాబాద్‌కు 11 గంటలకు చేరుకొంటుంది. 17230 సికింద్రాబాద్ - తిరువనంతపురం శబరి ఎక్స్‌ప్రెస్ 20629గా మారుతుంది. ఈ రైలు నిత్యం మధ్యాహ్నం 2.25కి బయలుదేరి సాయంత్రం 5.19కి నడికుడి, 5.39కి పిడుగురాళ్ల, 6.14కి సత్తెనపల్లి, రాత్రి 6.50కి గుంటూరు, 7.48కి తెనాలి, 8.03కి నిడుబ్రోలు, 8.23కి బాపట్ల, 8.38కి చీరాల, అర్ధరాత్రి దాటాక 1.33కి తిరుపతి, మరుసటి రోజు సాయంత్రం 6.20కి తిరువనంతపురం చేరుకొంటుంది.

సేవ, నిజాయితీగా
విధులు నిర్వహించాలి

● ప్రొబేషనరి ఎస్ఐలకు రేంజ్ ఐజీ త్రిపాఠి సూచన


ప్రొబేషనరి ఎస్ఐలకు దిశా నిర్దేశం చేస్తున్న ఐజీ సర్వ శ్రేష్ఠత్రిపాఠి

గుంటూరు, జూలై 22 (ఆంధ్రజ్యోతి): నిబద్ధత, నిజాయితీ, అంకితభావం, సేవా తత్పరతలతో విధులు నిర్వహించాలని ప్రొబేషనరి ఎస్ఐలకు రేంజ్ ఐజీ సర్వ శ్రేష్ఠ త్రిపాఠి సూచించారు. శిక్షణ పూర్తి చేసుకున్న 53 మంది ప్రొబేషనరి ఎస్ఐలు మంగళవారం మర్యాదపూర్వకంగా రేంజ్ కార్యాలయంలో ఐజీని కలిశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ శాంతి భద్రతల పరిరక్షణ, నేర పరిశోధన, సాంకేతిక పరిజ్ఞానం, పోలీసింగ్‌లో ఎదురయ్యే సవాళ్లను సమర్థంగా ఎదుర్కొనేందుకు ఎప్పటికప్పుడు అవగాహన పెంపొందించుకోవాలన్నారు. రికార్డులు, స్థానిక చట్టాలు, భౌగోళిక పరిస్థితులపై పూర్తి అవగాహన కలిగి ఉండాలన్నారు. సహచర ఉద్యోగులు, ప్రజలతో విశ్వాసపూర్వక సంబంధాలు కలిగి ఉన్నప్పుడే సమర్థవంతమైన పోలీసింగ్ సాధ్యమవుతుందన్నారు. గుంటూరు జిల్లా నుంచి 23 మంది, పల్నాడు నుంచి 13, బాపట్ల నుంచి 10, ప్రకాశం నుంచి ఒకరు, నెల్లూరు, తిరుపతి నుంచి ముగ్గురు చొప్పున శిక్షణ పూర్తి చేసుకున్నారు. ఈ కార్యక్రమంలో ఏఆర్ డీఎస్పీ ఏడుకొండలరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

అమరావతి రైలు మార్గానికి..
భూములిస్తాం!

● నష్టపరిహారం ఎంత ఇస్తారో చెప్పాలి ● భూ సమీకరణ అయితే ఎక్కడ ప్లాట్లు ఇస్తారు
● కొప్పురావూరులోని కొంతమంది రైతులు జేసీకి నివేదన

గుంటూరు, జూలై 22 (ఆంధ్రజ్యోతి): అమరావతి రాజధానికి కేంద్ర ప్రభుత్వం మంజూరు చేసిన రైలు మార్గానికి అవసరమైన భూములు ఇచ్చేందుకు సిద్ధమని పెదకాకాని మండలంలోని కొప్పురావూరుకు చెందిన రైతులు పేర్కొన్నారు. అయితే ముందు తమకు ఎంత నష్టపరిహారం ఇస్తారో స్పష్టం చేయాలని కోరారు. అలానే ఒక వేళ భూ సమీకరణ పథకం కింద భూములు తీసుకొనేట్లు అయితే తమకు రిటర్న బుల్ ప్లాట్స్ ఎక్కడ, ఎప్పటిలోపు ఇస్తారో కూడా చెప్పాల న్నారు. భూ సేకరణ కాంపిటెంట్ అథారిటీ అయిన జాయింట్ కలెక్టర్ జారీ చేసిన నోటీసులకు సమాధానం ఇచ్చేందుకు రైతులు మంగళవారం సాయంత్రం కలెక్టరేట్‌కు వచ్చి జేసీని కలిసి చర్చించారు. అనంతరం రైతులు మీడియాతో మాట్లా డారు. తమకున్న అనుమానాలను వ్యక్తపరుస్తూ వాటిని నివృత్తి చేయాలన్నారు.

'తాడికొండ మండలంలోని కంతేరుని ఆనుకొనే కొప్పురావూరు ఉంది. ఈ గ్రామం భూసేకరణ ప్రాజెక్టులతో పూర్తిగా నిర్వీర్యమైపోతుంది. ఇప్పటికే ఒక రైలుమార్గం ఉంది. ఇప్పుడు మరొక రైలు మార్గం వేస్తామంటున్నారు. అలానే ఆ రెండు మార్గాలను కలుపుతూ మరో లైను వేస్తామంటున్నారు. ఇంకో వైపు బైపాసు, ఓఎన్‌జీసీ పైపులైను వేస్తామంటున్నారు. వీటి వల్ల మేము బలవుతున్నాం. మేము జేసీని కలిశాం, అయితే మాకు ఏమి చేస్తారో చెప్పడం లేదు. మేము ప్రభుత్వానికి వ్యతిరేకం కాదు. రైల్వేలైను, గ్యాస్ లైనుకు సపోర్టు చేస్తాం. మమ్మల్ని తీవ్ర గందరగోళంలో పడేసి పెగ్ మార్కింగ్ వేస్తాం.. అప్పుడు చూద్దామంటున్నారు. ఇది ఎంతవరకు సమంజసం' అని రైతులు ప్రశ్నించారు.

అమరావతి రాజధాని కోసం తెలంగాణలోని ఎర్రుబాలెం నుంచి కృష్ణానది, రాజధాని గ్రామాల మీదగా నంబూరు వరకు ఒక రైలుమార్గాన్ని కేంద్రం మంజూరు చేసింది. దీనికి సంబంధించి గుంటూరు జిల్లా వరకు భూసేకరణ అధికారిగా జేసీని నియమించింది. గత ఏడాదే భూసేకరణ నోటిఫికేషన్లను జారీ చేసి రైతుల నుంచి అభ్యంతరాలను తెలపాల్సిం దిగా కోరారు. కొప్పురావూరు రైతులు ఇప్పటికే ఒకటి, రెండు దఫాలు తమ ఆవేదనని కలెక్టర్‌కు నివేదించారు. తాజాగా మంగళవారం జేసీ ఎదుట హాజరు కావాలని వచ్చిన నోటీసులకు సమాధానంగా రైతులు వచ్చి జేసీని కలిసి తమ అభ్యంతరాలను తెలిపారు.


కలెక్టరేట్‌లో జేసీకి తమ అభ్యంతరాలను తెలిపి బయటకు వస్తున్న కొప్పురావూరు రైతులు

ఆరోగ్యానికి
సప్తవర్ణాల సూత్రం!

●సామాజిక ఆరోగ్య కేంద్రాల్లో ఏడు రంగుల దుప్పట్లు ●వార్డుల్లో పడకలు మరింత శుభ్రంగా


సత్తెనపల్లి ఏరియా వైద్యశాలలోని మంచాల పై బెడ్ షీట్లు పరుస్తున్న దృశ్యం

సత్తెనపల్లి, జూలై 22 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ ఆస్పత్రుల్లో చికిత్స పొందే రోగులకు వైద్యంతో పాటు.. పారిశుభ్ర వాతావరణం చాలా అవసరం. ఇందుకు కూటమి ప్రభుత్వం సప్తవర్ణాల సూత్రం అమలుకు నిర్ణయం తీసు కుంది. దీంతో ఆస్పతుల్లోని వార్డుల్లో పడకలపై రోజుకొక రంగుతో.. వారం రోజులూ ఏడు రంగుల దుప్పట్లు మార్చ నున్నారు. రోగులు, ఉద్యోగులు ఇబ్బందులు పడకుండా ఇంద్రధనస్సు తరహాలో సప్త వర్ణాల దుప్పట్లు వేసేందుకు నిధులు కేటాయిస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు ఇచ్చింది. సామాజిక ఆరోగ్య కేంద్రాల్లో పడకల సంఖ్య ఆధారంగా రంగు రంగుల దుప్పట్లు ఇవ్వనున్నారు. ఆదివారం నుంచి శనివారం వరకు ఒక్కో రోజు ఒక్కో రంగు దుప్పటి వేయనున్నారు. 30, 50, వంద పడకల ఆస్పత్రులు, జిల్లా, ప్రాంతీయ ఆస్పత్రులు వైద్య విధాన పరిషత్ పరిధిలో ఉంటాయి. వీటిలో సంస్కరణలు అమలయ్యేలా ప్రభుత్వం చర్యలు చేపట్టింది. వార్డుల్లో పడకలు మరింత పరిశుభ్రంగా ఉండేలా చూడాలని ఆదేశాలిచ్చింది.

బాలింతలకు మేలు..

వైద్యశాలకు వచ్చే గర్భిణులు సాధారణ ప్రసవాలు ఐతే మూడు రోజులు, సిజేరియన్ జరిగితే తొమ్మిది రోజులు ఆస్పత్రిలో ఉంటారు. ఇంకా వివిధ రకాల జబ్బులతో ఆస్పత్రికి వచ్చే రోగులు రోగాన్ని బట్టి వారం రోజుల వరకు ఆస్పత్రుల్లోనే ఉంటారు. ప్రస్తుతం వినియోగిస్తున్న తెలుపు రంగు దుప్పట్ల స్థానంలో వారంలో ఏడు రోజులు ఏడు రంగుల దుప్పట్లను ఏర్పాట్లు చేయనున్నారు. ప్రస్తుతం ఆస్పత్రుల్లో మంచాలకు వాడుతున్నవన్నీ తెలుగు రంగు దుప్పట్లు, పునర్వినియోగం లేని నీలి రంగు బెడ్ షీట్లు మాత్రమే. వైరల్ ఇన్‌ఫెక్షన్, ఇతర అత్యవసర పరిస్థితిని బట్టి డిస్పోజల్ బెడ్ షీట్లు వాడుతుంటారు. తెలుపు దుప్పట్లపై రక్త, ఇతర మరకలు ఉంటే ఉతికినవి అయినా. మళ్లీ వాడేందుకు ఇబ్బందికరంగా ఉంటాయి. ఈ క్రమంలో సదరు రోగులు ఇళ్ల నుంచి దుప్పట్లు తెచ్చి వేసుకుం టున్నారు మరికొందరు బాగున్నవి వేయాలంటూ సిబ్బందితో వాగ్వాదానికి దిగుతున్నారు.



సత్తెనపల్లి ఏరియా వైద్యశాల

సముచిత నిర్ణయం



ఆస్పత్రికి వచ్చే రోగులు ఇక్కడి వాతావరణం ఎంత బాగుంటే అంత త్వరగా కోలుకుంటారని సత్తెనపల్లి ఏరియా వైద్యశాల ఇన్‌చార్జ్ ఆర్ఎంవో డాక్టర్ కృష్ణమూర్తి పేర్కొన్నారు. ప్రభుత్వ తాజా నిర్ణయంతో రోగులకు మేలు జరుగుతుందన్నారు. ఏ రోజు ఏ రంగు వాడలో ముందే నిర్ణయించడం సముచితమన్నారు.

-డాక్టర్ కృష్ణమూర్తి, ఇన్‌చార్జ్ ఆర్ఎంవో, సత్తెనపల్లి ఏరియా వైద్యశాల

పల్నాడు వార్తలు

◆ నరసరావుపేట ◆ వినుకొండ ◆ చిలకలూరిపేట

చిరస్మరణీయుడు మహాకవి దాశరథి: పీవీ సుబ్బారావు

చిలకలూరిపేట, జూలై 22 (ఆంధ్రజ్యోతి): అగ్నిధార, రుద్రవీణ వంటి ప్రముఖ అభ్యుదయ కావ్యాలు రచించిన గొప్పకవి దాశరథి అని ప్రముఖ సాహితీ విమర్శకులు డాక్టర్ పీవీ సుబ్బారావు అన్నారు. స్థానిక శాఖా గ్రంథాలయంలో జనవిజ్ఞాన వేదిక ఆధ్వర్యంలో మంగళవారం జరిగిన దాశరథి శత జయంతి ముగింపు కార్యక్రమంలో ఆయన పాల్గొని మాట్లాడారు. ఓ నిజాం పిశాచమా, మా నిజాం తరతరాల బూజు అని ధైర్యంగా నిజాంను ఎదిరించి, నిరసించి జైలుకువెళ్లిన ప్రజాకవి దాశరథి అని ఆయన కొనియాడారు. నా తెలంగాణ కోటి రత్నాల వీణ అని తన ప్రాంతీయతను చాటుకున్న దాశరథి ప్రజల హృదయాలలో నిలిచిపోతారన్నారు. ఎన్నో జనరంజకమైన సినిమా పాటలు రాసి ఆంధ్రుల హృదయాలలో చిరస్మరణీయుడుగా దాశరథి నిలిచి పోయారనన్నారు. కార్యక్రమంలో జన విజ్ఞాన వేదిక రాష్ట్ర కార్యదర్శి దార్ల బుజ్జిబాబు తదితరులు పాల్గొన్నారు.

బ్యాడ్మింటన్ పోటీలలో సీఆర్ క్లబ్ క్రీడాకారిణుల ఘన విజయం

చిలకలూరిపేట, జూలై 22 (ఆంధ్రజ్యోతి): జిల్లా బ్యాడ్మింటన్ అసోసియేషన్ ఆధ్వర్యంలో గుంటూరు ఎన్టీఆర్ స్టేడియంలో రెండు రోజులపాటు జరిగిన జిల్లా షటిల్ బ్యాడ్మింటన్ పోటీలలో స్థానిక సీఆర్ క్లబ్ క్రీడాకారిణులు ఘన విజయం సాధించారు. 500మంది క్రీడాకారులు ఈ పోటీలలో పాల్గొన్నారు. ఈ పోటీలలో ఉమెన్ సింగిల్స్ చాంపియన్‌గా చిన్నపాటి లోకేశ్వరి, అండర్ 19 డబుల్స్ రన్నరప్‌లుగా చెన్నుపాటి లక్ష్మీ పల్లవి, లోకేశ్వరి, అండర్ 17 సింగిల్స్ రన్నర్‌గా చెన్నుపాటి లోకేశ్వరి, అండర్ 17 డబుల్స్ రన్నర్స్‌గా చెన్నుపాటి లోకేశ్వరి, శ్రీలత విజయం సాధించారు. ఈ నెల 27, 28 తేదీలలో తిరుపతిలో జరగబోయే రాష్ట్ర స్థాయి పోటీలలో పాల్గొనేందుకు వీరు అర త సాధించారు. ముగింపు కార్యక్రమంలో అసోసియేషన్ జిల్లా అధ్యక్ష కార్యదర్శులు రాయపాటి రంగారావు, దామచర్ల శ్రీనివాసరావు విజేతలకు పతకాలు, ప్రశంసాపత్రాలు అం దచేశారు. కాగా విజేతలకు స్థానిక సీఆర్ క్లబ్ అధ్యక్ష కార్యదర్శులు చెరుకూరి కాంత య్య, పావులూరి శ్రీనివాసరావు, కోశాధికారి మక్కెన నరసింహారావు అభినందనలు తెలిపారు.

క్లుప్తంగా...

● చిలకలూరిపేట, జూలై 22 (ఆంధ్రజ్యోతి): స్థానికసేవా సంస్థ ఒయాసిస్ ఆధ్వర్యంలో మంగళవారం పట్టణంలోని శ్రీసాయి కృప ప్రశాంతి వృద్ధాశ్రమంలోని వృద్ధులకు రూ.12వేలు విలువచేసే దుస్తులు, మందులు, నిత్యావసరాలను అందచేశారు. సంస్థ కార్యదర్శి కరణం విజయలక్ష్మి తండ్రి ఆదినారాయణ జ్ఞాపకార్థం ఆమె తల్లి రంగనాయకమ్మ ఆర్థికసాయంతో ఈ కార్యక్రమం నిర్వహించారు.

● రొంపిచర్ల: పంటల బీమాను రైతులు నమోదు చేసుకోవాలని ఏవో శివ లలిత మంగళవారం తెలిపారు. మండలంలోని వీరవట్నం, అన్నవరప్పాడులో వ్యవసాయశాఖ ఆధ్వర్యంలో పొలం పిలుస్తోంది కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ వరి, కంది, ఎర్ర మిరప పంటలకు పోస్టాఫీసు, సచివాలయాలు, బ్యాంక్ ఖాతాదారుల సేవాకేంద్రంలలో బీమా ప్రీమియం చెల్లించవచ్చన్నారు.

● నరసరావుపేట రూరల్: మండలంలోని లింగంగుంట్ల పంచాయతీ పరిధిలోని శంకర భారతీపురం జిల్లా పరిషత్ హైస్కూల్ విద్యార్థులు బంగారు పతకం సాధించారు. గుంటూరు జిల్లా రేపల్లెలో ఈ నెల 20వ తేదీన జరిగిన తెక్వాండో పోటీలలో పూర్వ విద్యార్థి జాన్‌పాల్, 8వ తరగతి విద్యార్థి జి.దేవరాజు పాల్గొని విజయం సాధించారు. ఈ సందర్భంగా పాఠశాలల ప్రధానోపాధ్యాయులు పార్వతి, పీడీలు యు.పద్మావతి, పి.తిరుపతిరావు తదితరులు విద్యార్థులను అభినందించారు.

● నరసరావుపేట టౌన్: రాష్ట్రస్థాయి సీనియర్స్ టైక్వాండో చాంపియన్‌షిప్-2025లో ఎస్ఎస్ఎన్ కళాశాల విద్యార్థి వీ తులసీ తన్మయ్ బంగారుపతకం సాధించిందని ప్రిన్సిపాల్ డాక్టర్ ఎంఎస్ సుధీర్ మంగళవారం తెలిపారు. గుంటూరు జిల్లా రేపల్లెలో జరిగిన రాష్ట్రస్థాయి సీనియర్స్ టైక్వాండో చాంపియన్‌షిప్‌లో 46కేజీల కేటగిరి మహిళా విభాగంలో బంగారుపతకం సాధించిందన్నారు.

● చిలకలూరిపేట: చిలకలూరిపేట మండలం కుక్కపల్లివారిపాలెం గ్రామ శివారు పొలాల్లో పేకాట ఆడుతున్న ముగ్గురు వ్యక్తులను చిలకలూరిపేట రూరల్ ఎస్ఐ జి.అనిల్ కుమార్ మంగళవారం అరెస్టు చేశారు. వారి వద్ద నుంచి రూ.3,500 నగదు స్వాధీనం చేసుకున్నారు.

● చిలకలూరిపేట: మార్కెట్ యార్డ్ చైర్మన్‌గా నియమితులైన స్థానిక టీడీపీ సీనియర్ నేత షేక్ కరిముల్లాకు మంగళవారం రాజాపేట గ్రామ టీడీపీ నాయకులు, మోటర్ వర్కర్స్ వెల్‌ఫేర్ యూనియన్ సభ్యులు, 29, 38వ వార్డుల టీడీపీ నాయకులు, ఉన్నవ గ్రామ టీడీపీ నాయకులు, తెలుగు మహిళా నాయకులు సన్మానించారు.

● వినుకొండ: పట్టణంలోని పెద్ద పోస్టాఫీస్ పక్కన ఉన్న పాత శివాలయంలో అర్చక, పురోహిత సంఘం ఆధ్వర్యంలో నిర్వహించిన అహోరాత్ర రుద్ర పారాయణ యాగంలో ప్రభుత్వ చీఫ్‌విప్ జీవీ పాల్గొని ప్రత్యేక పూజలు నిర్వహించారు. కార్యక్రమంలో డీసీసీబీ చైర్మన్ మక్కెన మల్లికార్జునరావుతో పాటు పురోహిత సంఘం నాయకులు, భక్తులు పెద్దసంఖ్యలో పాల్గొన్నారు.

● నరసరావుపేట టౌన్: నరసరావుపేట జేఎన్‌టీయుకే కళాశాలలో రెండు రోజుగా నిర్వహిస్తున్న ఫ్యాకల్టీ డెవలప్‌మెంట్ ప్రోగాం మల్టీమీడియా క్వాలిటీ అసెస్మెంట్ టెక్నిక్స్ లాటెక్స్ టూల్ కార్యక్రమం మంగళవారం ముగిసింది. రిసోర్స్‌పర్సన్ డాక్టర్ ఎస్‌బీజీ తిలక్‌బాబు మల్టీమీడియా రంగంలోని ఆధునిక అల్గోరిథమ్స్, ప్రామాణికమైన పారామెటర్స్ గురించి వివరించారు.

● వినుకొండ టౌన్: రెండు ఆవులను గుర్తు తెలియని లారీ ఢీకొనడంతో రెండు ఆవులు అక్కడికక్కడే మృతి చెందిన సంఘటన పట్టణంలోని ఆర్‌టీసీ బస్టాండ్ వద్ద మంగళవారం జరిగింది. వీధుల్లో ఆవులు సంచరిస్తుండగా బస్టాండ్ సెంటర్‌లో తెల్లవారుజామున గుర్తు తెలియని లారీ ఢీకొందని మున్సిపల్ అధికారులు తెలిపారు.

తరచూ విద్యుత్ అంతరాయాలు



వినుకొండలోని విద్యుత్ సబ్‌స్టేషన్

- ఎప్పుడు వస్తుందో తెలియని అయోమయ పరిస్థితి
- వేళాపాళా లేని కోతలతో పట్టణ వాసుల లబోదిబో
- విద్యుత్ శాఖ సిబ్బంది నిర్లక్ష్యంవల్లేనని పలువురి ఆరోపణ

వినుకొండ టౌన్, జూలై 22 (ఆంధ్రజ్యోతి): ఈదురు గాలి సోకితే చాలు విద్యుత్ సరఫరాలో అంతరాయంతో పట్టణ వాసులు గత కొంతకాలంగా తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ప్రజలకు కోతలు లేని కరెంటు, నాణ్యమైన విద్యుత్ సరఫరా అందించాలని ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు పదేపదే ఆదేశించినప్పటికీ ఆ శాఖ అధికారుల్లో మాత్రం చలనం కనిపించడం లేదు. వినుకొండ పట్టణంలో మొత్తం 32వార్డులు ఉండగా సుమారు 60వేల నివాస గృహాలతో పాటు వీధి దీపాలకు విద్యుత్ సరఫరా చేస్తున్నారు. అయితే వినుకొండ పట్టణానికి విద్యుత్ సరఫరా అందించే వినుకొండ సబ్‌స్టేషన్, చెక్కవాగులోని 33/11 కేవీ ద్వారా విద్యుత్ సరఫరా అందిస్తున్నారు. మొత్తం 8 ఫీడర్లు ఉండగా పట్టణంలోని నరసరావుపేట రోడ్డు, సిద్దార్థనగర్, ఇందిరానగర్, ఎన్ఎస్‌పీ కాలనీ, ఏనుగుపాలెం రోడ్డు, నూజెండ్ల రోడ్డులోని వినియోగదారులు విద్యుత్ కోతలతో తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ఆదివారం సాయంత్రం 4గంటల నుంచి రాత్రి 11 గంటల వ్యవధిలో 7సార్లు విద్యుత్ సరఫరాలో అంతరాయం ఏర్పడటంతో ఆ శాఖ అధికారుల తీరుపై పట్టణ ప్రజలు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ఇదిలా ఉండగా విద్యుత్ శాఖలో పనిచేసే లైన్‌మెన్‌లు ప్రైవేటు ఎలక్ట్రీషియన్లపై ఆధారపడుతున్నారు. వారు అందుబాటులోకి వచ్చిన వెంటనే ఎల్‌సీల పేరుతో గంటల కొద్ది విద్యుత్‌కు అంతరాయం కల్పించడం వినుకొండలో పరిపాటిగా మారింది. అధికారులు, నాయకులు దృష్టిసారించి పట్టణంలో నాణ్యమైన కోతలు లేని విద్యుత్‌ను అందించాలని ప్రజలు కోరుతున్నారు.

ఐదేళ్లలో వ్యవస్థలను నాశనం చేసిన జగన్

● చీఫ్ విప్ జీవీ ఆంజనేయులు



దివ్యాంగురాలిని పలకరిస్తున్న చీఫ్‌విప్ జీవీ ఆంజనేయులు

వినుకొండ, జూలై 22 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో జగన్ ఐదేళ్ల పాలనలో వ్యవస్థలను నాశనం చేయడం, ప్రజలను వేధించడం తప్ప చేసింది శూన్యమని ప్రభుత్వ చీఫ్‌విప్ జీవీ ఆంజనేయులు ధ్వజమెత్తారు. ఐదేళ్ల వారి అరాచకాలు ఏడాదిలో కూటమి ప్రభుత్వం చేసిన అభివృద్ధే తమ సుపరిపాలనకు నిదర్శనమన్నారు. వినుకొండ పట్టణంలోని 18వ వార్డులో సుపరిపాలనలో తొలి అడుగు కార్యక్రమం మంగళవారం చేపట్టారు. డీసీసీబీ చైర్మన్ మక్కెన మల్లికార్జునరావుతో కలిసి సంక్షేమ పథకాలపై స్థానికులకు అవగాహన కల్పించి కరపత్రాలను పంపిణీ చేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ గత పాలకులు రాజ్యాంగ వ్యవస్థలపై దాడులు చేసి చిన్న కాంట్రాక్టర్లను సైతం వేధించారని విమర్శించారు. 2014-2019 మధ్య కాలంలో జరిగిన ఎన్ఆర్ఈజీఎస్ పనులకు 250కోట్లు రూపాయలు బిల్లులు క్లోజ్ చేయడం వారి దుర్మార్గానికి నిదర్శనమన్నారు. 3.5లక్షల మంది చిన్న కాంట్రాక్టర్లపై కక్షకట్టి బిల్లులను నిలిపివేశారని ఆవేదన వ్యక్తం చేశారు. తాము అధికారంలోకి వచ్చిన తరువాత వారికి న్యాయం చేయడం మొదలుపెట్టామని, ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు, ఉప ముఖ్యమంత్రి పవన్‌కల్యాణ్ చొరవ, కేంద్ర ప్రభుత్వ సహకారంతో అది సాధ్యమైందన్నారు. రామలింగేశ్వరస్వామి ఘాట్ రోడ్డు, తారురోడ్డు, గుడి అభివృద్ధితో పాటు వినుకొండను పుణ్యక్షేత్రంగా తీర్చిదిద్దే పనులను చేపడతామని హామీ ఇచ్చారు. రైతుల పేరిట రాజకీయం చేయడం తగదని, వైసీపీ ప్రభుత్వ హయాంలో రైతుల వద్ద కొనుగోలు చేసిన ధాన్యానికి నగదు చెల్లించని పక్షంలో ఎన్‌డీఏ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన వెంటనే రైతుల ఖాతాల్లో నగదు జమ చేశామన్నారు. కార్యక్రమంలో టీడీపీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

మృతుల కుటుంబాలకు పరామర్శ

వినుకొండ టౌన్, జూలై 22 (ఆంధ్రజ్యోతి): శావల్యాపురం మండలం కనమర్లపూడి వద్ద ఆటోను లారీ ఢీకొన్న ఘటనలో మృతిచెందిన కుటుంబాలను చీఫ్ విప్ జీవీ ఆంజనేయులు డీసీసీబీ చైర్మన్ మక్కెన మల్లికార్జునరావుతో కలిసి వినుకొండ ప్రభుత్వ వైద్యశాలలో పరామర్శించి ధైర్యం చెప్పారు. అనంతరం జీవీ మాట్లాడుతూ వ్యక్తిగతంగా, ప్రభుత్వపరంగా వారికి అన్నివిధాలుగా అండగా ఉంటామని హామీ ఇచ్చారు. అనంతరం మక్కెన మాట్లాడుతూ ప్రభుత్వం తరఫున పూర్తిస్థాయిలో అండదండలు ఉంటాయని భరోసా ఇచ్చారు. శివశక్తి లీలా ఫౌండేషన్ తరఫున మృతుల కుటుంబాలకు రూ.10వేలు ఆర్థిక సాయం చొప్పున అందజేశారు. బాధితుల్లో ఒకరికి టీడీపీ సభ్యత్వం ఉందని, వారికి పార్టీపరంగా వచ్చే బీమా పరిహారం వేగంగా వచ్చేలా చూస్తామన్నారు. కార్యక్రమంలో శావల్యాపురం మండల టీడీపీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

ఐనవోలులో పీహెచ్‌సీ ప్రారంభం

నూజెండ్ల, జూలై 22 (ఆంధ్రజ్యోతి): మండలంలోని ఐనవోలు గ్రామంలో ప్రాథమిక వైద్యశాలను చీఫ్ విప్, ఎమ్మెల్యే జీవీ ఆంజనేయులు సోమవారం రాత్రి ప్రారంభించారు. నూతన భవనాలు నిర్మించటం ఆలస్యమవుతున్న స్థానిక సచివాలయంలో వైద్యశాల ప్రారంభించామన్నారు. కార్యక్రమంలో జీడీసీసీ బ్యాంక్ చైర్మన్ మక్కెన మల్లికార్జునరావు, ఐనవోలు డీసీ చైర్మన్ రావుల బుజ్జి, టీడీపీ నాయకులు పాల్గొన్నారు.



బాధితులను పరామర్శిస్తున్న చీఫ్ విప్ జీవీ ఆంజనేయులు

పచ్చదనాన్ని పెంపొందించడం అందరి బాధ్యత

ఎమ్మెల్యే డాక్టర్ అరవిందబాబు

నరసరావుపేట టౌన్, జూలై 22 (ఆంధ్రజ్యోతి): పచ్చదనాన్ని పెంపొందించడం అందరి బాధ్యత అని ఎమ్మెల్యే డాక్టర్ చదలవాడ అరవిందబాబు అన్నారు. పట్టణంలోని ఎన్జీవో కాలనీలో మంగళవారం సుపరిపాలనలో తొలి అడుగు కార్యక్రమం నిర్వహించారు. వన మహోత్సవంలో భాగంగా కనుమూరి ఆంజనేయులు జ్ఞాపకార్థం కుమారుడు ఎన్ఆర్ఐ కనుమూరి ఈశ్వర్ సహకారంతో మొక్కలునాటే కార్యక్రమం కాలనీలోని ఎన్టీఆర్ గార్డెన్‌లో జరిగింది. ముఖ్యఅతిథిగా ఎమ్మెల్యే అరవిందబాబు పాల్గొని మొక్కలు నాటారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే డాక్టర్ చదలవాడ అరవిందబాబు మాట్లాడుతూ వృక్షో రక్షితః రక్షితః ధర్మో రక్షిత రక్షితః అనే నినాదంతో ప్రకృతిని పరిరక్షించే లక్ష్యంతో కార్యక్రమాన్ని చేపట్టామన్నారు. కూటమి ప్రభుత్వం ఏర్పడిన తర్వాత ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు, డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ నాయకత్వంలో కార్యకర్తలు, అభిమానులు సమష్టిగా అభివృద్ధికోసం కృషి చేస్తున్నారన్నారు. నరసరావుపేట మున్సిపాలిటీని రాష్ట్రంలోనే నెంబర్‌వన్‌గా తీర్చిదిద్దేందుకు నాయకులందరూ సహకారం అందిస్తున్నారన్నారు. కార్యక్రమంలో కూటమి నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.



ఎన్జీవో కాలనీలో మొక్కలు నాటే కార్యక్రమంలో పాల్గొన్న ఎమ్మెల్యే డాక్టర్ చదలవాడ తదితరులు

ఆధునిక గ్రంథాలయం ఏర్పాటుకు రూ.2కోట్లు

నరసరావుపేటలో ఆధునిక డిజిటల్ గ్రంథాలయం ఏర్పాటుకు రాష్ట్ర ప్రభుత్వం రూ.2కోట్లు నిధులు మంజూరు చేసిందని ఎమ్మెల్యే డాక్టర్ చదలవాడ అరవిందబాబు అన్నారు. మంగళవారం నరసరావుపేట శివారు కలెక్టర్ కార్యాలయం సమీపంలో స్థలం పరిశీలన జరిగింది. ఈ సందర్భంగా ఎమ్మెల్యే డాక్టర్ చదలవాడ అరవిందబాబు మాట్లాడుతూ రాష్ట్ర గ్రంథాలయ పరిషత్ చైర్మన్ గోనుగుంట్ల కోటేశ్వరరావు పర్యవేక్షణలో అమలు చేస్తారన్నారు. 42సెంట్ల స్థలంలో ఈ డిజిటల్ గ్రంథాలయం నిర్మాణం జరుగుతుందన్నారు. ఈ గ్రంథాలయ నిర్మాణం విద్యార్థులు, పోటీ పరీక్షలకు సిద్ధపడే యువత, పరిశోధకులకు అత్యాధునిక సమాచార వనరులను అందించడంతో పాటు, ప్రాంతీయ అభివృద్ధికి ఊతం ఇస్తుందన్నారు. డిజిటల్ గ్రంథాలయంలో హై-స్పీడ్ ఇంటర్నెట్, ఈ బుక్స్, ఆన్‌లైన్ జర్నల్స్, మల్టీమీడియా లెర్నింగ్ సౌకర్యాలు ఉంటాయన్నారు. ఈ ప్రాజెక్టు పూర్తి అయితే నరసరావుపేట విద్యాకేంద్రంగా మరింత ప్రాముఖ్యత సంతరించుకుంటుందన్నారు. స్థల పరిశీలనలో మున్సిపల్ కమిషనర్ ఎం.జస్వంత్‌రావు, ఆర్డీవో ఎం.మధులత, కూటమి నాయకులు పాల్గొన్నారు.

మహంకాళి అమ్మవారికి బోనాలు, ఆషాఢం సారె

నరసరావుపేట టౌన్, జూలై 22 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని పాలపాడు రోడ్డులోని చిన్న శింగరకొండ ప్రసన్నాంజనేయస్వామి దేవస్థానం నుంచి ఆషాఢమాసం సందర్భంగా మంగళవారం బోనాలు తీసుకువెళ్లారు. ముందుగా ప్రసన్నాంజనేయస్వామికి ప్రత్యేక అలంకరణ పూజలు నిర్వహించారు. మహిళలు కోలాటంతో ఇస్సపాలెం మహంకాళి అమ్మవారికి బోనాలు, ఆషాఢ సారె, గాజులు, పసుపు, కుంకుమ, నిమ్మకాయల దండలు, మిఠాయిలు తీసుకెళ్ళారు. చిన్న శింగరకొండ ప్రసన్నాంజనేయ స్వామి దేవస్థానం నుంచి డీజే, కోలాటంతో ఊరేగింపు వైభవంగా జరిగింది. అనంతరం ఆషాఢమాసం సారె, గాజులు, పసుపు, కుంకుమ, నిమ్మకాయల దండలు అమ్మవారికి సమర్పించారు. కార్యక్రమంలో మహిళలు, భక్తులు, ఆలయ కమిటీ చైర్మన్ బీ శ్రీనివాసరావు, తదితరులు పాల్గొన్నారు.





ప్రత్యేక అలంకరణలో ప్రసన్నాంజనేయస్వామి, బోనాలతో, కోలాటం చేస్తూ ఊరేగింపుగా వెళుతున్న మహిళలు



పొట్లూరులో బోనాలతో తరలివెళుతున్న మహిళలు

ఘనంగా తిరుపతమ్మ, ఎల్లమ్మలకు బోనాలు

శావల్యాపురం, జూలై 22 (ఆంధ్రజ్యోతి): మండలంలోని పొట్లూరు పంచాయతీ పరిధిలోని అద్దంకి బ్రాంచ్ కెనాల్ వద్దనున్న శ్రీలక్ష్మీ తిరుపతమ్మ, మావురాల ఎల్లమ్మతల్లి దేవాలయంలో అమ్మవార్ల బోనాల వేడుకను భక్తులు మంగళవారం ఘనంగా నిర్వహించారు. మండలంలోని పొట్లూరు, కృష్ణాపురం గ్రామాలకు చెందిన మహిళలు బోనాలు కట్టుకొని మేళతాళాలతో దేవాలయం వద్దకు తరలివెళ్ళారు. కళాకారులు వివిధ వేషధారణలు ధరించి ప్రత్యేక ఆకర్షణగా నిలిచారు. అనంతరం ఆలయకమిటీ సభ్యులు అన్నదానం చేశారు.

వ్యాసరచన పోటీలలో కే-రిడ్జి విద్యార్థుల ప్రతిభ



ప్రతిభచాటిన విద్యార్థులను అభినందిస్తున్న చైర్మన్ నాతాని వెంకటేశ్వర్లు తదితరులు

నరసరావుపేట టౌన్, జూలై 22 (ఆంధ్రజ్యోతి): కే-రిడ్జి ఇంటర్నేషనల్ స్కూల్‌లో టాటా కంపెనీ ఆధ్వర్యంలో జూనియర్, సీనియర్ స్థాయిలలో వ్యాసరచన పోటీలు మంగళవారం నిర్వహించారు. ఫైవ్ థింగ్స్ ఐ విల్ డు టు బిల్డ్ ఏ సెల్ఫ్ రిలయంట్ ఇండియా (స్వీయ ఆధారిత భారతదేశాన్ని నిర్మించడానికి నేను చేసే ఐదు పనులు) అనే అంశంపై వ్యాసరచన పోటీలలో ప్రతిభ కనబరిచారు. పి.వెంకట జాహ్నవి, ఎ.దేవీదీక్ష బంగారు పతకాలు, షేక్ అబ్దుల్ లతీఫ్, కావ్యశ్రీబాయ్ రజతం, కే సాయి సంప్రీత్, సీహెచ్ హరి తేజస్వి కాంస్య పతకాలు సాధించారు. ప్రతిభ కనబరిచిన విద్యార్థులను చైర్మన్ నాతాని వెంకటేశ్వర్లు అభినందించారు. ప్రిన్సిపాల్ జీ బర్నబాస్, డైరెక్టర్ కోమటినేని నాసరయ్య, క్యాంపస్ ఇన్‌చార్జి కోట బాపూజీ, టాటా సంస్థ ప్రతినిధుల సందీప్, రామాంజనేయులు విద్యార్థులను అభినందించారు.

ప్రమాదంలో గాయపడిన వ్యక్తి మృతి

నూజెండ్ల, జూలై 22 (ఆంధ్రజ్యోతి): ప్రమాదంలో గాయపడిన వ్యక్తి మంగళవారం ఉదయం వినుకొండ ప్రభుత్వ ఆస్పత్రిలో మృతిచెందాడు. కుటుంబ సభ్యులు తెలిపిన వివరాల ప్రకారం మండలంలోని మారెళ్ళవారిపాలెం గ్రామానికి చెందిన బత్తుల సాంబయ్య(63) ఈ నెల 18వ తేదీన వినుకొండ నుంచి మారెళ్ళవారిపాలెం వస్తుండగా గ్రామ సమీపంలో మోటారు సైకిల్ అదుపుతప్పి ప్రమాదానికి గురయ్యాడు. వినుకొండ, గుంటూరు వైద్యశాలలకు తరలించి చికిత్సచేయించి వినుకొండకు తీసుకు రాగా వినుకొండ వైద్యశాలలో చికిత్స పొందుతూ మృతి చెందాడు. మృతునికి భార్య, ఒక కుమారుడు, ఒక కుమార్తె ఉన్నారు. చీఫ్ విప్, ఎమ్మెల్యే జీవీ ఆంజనేయులు, జీడీసీసీ బ్యాంక్ చైర్మన్ మక్కెన మల్లికార్జునరావులు, టీడీపీ నాయకులు మృతుడికి నివాళులర్పించి, కుటుంబ సభ్యులకు సానుభూతి తెలిపారు.

భోజనశాలకు రూ.51వేలు విరాళం

నాదెండ్ల, జూలై 22 (ఆంధ్రజ్యోతి): నాదెండ్ల మండలంలోని సాతులూరు గ్రామంలోని గ్రామ దేవతల దేవాలయ భోజనశాలకు భక్తులు విరాళం అందజేశారు. రూ.51,116ల విరాళాన్ని కేవీ రెడ్డి ఆలయ కమిటీకి చెందిన సభ్యులకు మంగళవారం అందజేశారు. కార్యక్రమంలో గ్రామానికి చెందిన ఉప్పుటూరి సురేష్, గొట్టిపాటి శ్రీనివాసరావు, కమ్మ సీతయ్య, శ్రీనివాసరావు, మల్లిఖార్జునరావు, శంకరరావు, శివప్రసాదు తదితరులు పాల్గొన్నారు.

పారిశుధ్య పనుల పరిశీలన

రొంపిచర్ల, జూలై 22 (ఆంధ్రజ్యోతి): మండలంలోని రొంపిచర్లలో పారిశుధ్య పనులను జిల్లా పంచాయతీ అధికారి నాగేశ్వరరావు నాయక్ మంగళవారం పరిశీలించారు. ఈ సందర్భంగా గ్రామస్థులతో మాట్లాడారు. గ్రామంలో చెత్త సేకరణపై ఆరా తీశారు. తడి, పొడి చెత్తలను వేరుగా సేకరించాలన్నారు. అనంతరం ఆయన మాట్లాడుతూ ఐవీఆర్ఎస్ కాల్స్ ద్వారా రొంపిచర్లలో చెత్తను తక్కువగా సేకరిస్తున్నారని ఫిర్యాదులు అందటంతో పరిశీలించేందుకు వచ్చినట్లు పేర్కొన్నారు. జిల్లాలో 256 గ్రామాల నుంచి ఫోన్‌ల ద్వారా వివరాలు సేకరిస్తున్నామన్నారు. అనంతరం గ్రామంలో తాగునీటి చెరువును పరిశీలించారు. చెరువు నుంచి ఎన్ని ట్యాప్‌ల్లో నీరు ఇస్తున్నారని పంచాయతీ కార్యదర్శి నాగేశ్వరరావును అడిగి తెలుసుకున్నారు. దేవుడుమాన్యం కాలనీలో 18 ట్యాప్‌ల ద్వారా నీరు ఇస్తున్నట్లు పంచాయతీ కార్యదర్శి తెలియజేశారు. గ్రామంలోని ఘన వ్యర్థాల షెడ్డును పరిశీలించారు. ఆయన వెంట ఈవోపీఆర్‌డీ సతీష్, పడాల చక్రారెడ్డిలు ఉన్నారు.

అనారోగ్యానికి గురైన విద్యార్థికి రోటరీ క్లబ్ చేయూత



విద్యార్థి కుటుంబ సభ్యులకు ఆర్థికసాయం అందచేస్తున్న రోటరీ క్లబ్ గ్రేటర్ సభ్యులు

వినుకొండ టౌన్, జూలై 22, (ఆంధ్రజ్యోతి): జీబీఎస్ అనే అరుదైన వ్యాధి బారినపడిన ఇంజినీరింగ్ విద్యార్థికి రోటరీ క్లబ్ గ్రేటర్ ద్వారా మంగళవారం కుటుంబ సభ్యులకు ఆర్థికసాయం అందచేశారు. శావల్యాపురం మండలం పొట్లూరు గ్రామానికి చెందిన చెరుకూరి ప్రణయ్‌గోపి గత కొంతకాలంగా గుంటూరులోని ఓ ప్రైవేటు వైద్యశాలలో చికిత్స పొందుతుండగా సమాచారం తెలుసుకున్న రోటరీ క్లబ్ గ్రేటర్ వినుకొండకు చెందిన వారు బాధితుడి కుటుంబ సభ్యులకు రూ.55వేల రూపాయల చెక్కును అందచేశారు. కార్యక్రమంలో క్లబ్ అధ్యక్ష కార్యదర్శులు వేరువ వెంకట నారాయణ, షేక్ బాజీ, ట్రెజరర్ నవీన్, సుధాకర్, గుమ్మా శ్రీకాంత్ రెడ్డి, ఆలా శ్రీనివాసరావు, చిరుమావిళ్ళ కోటేశ్వరరావు, ఎస్కే మస్తాన్, నాయబ్ రసూల్, విద్యార్థి కుటుంబ సభ్యులు పాల్గొన్నారు.

మాదకద్రవ్యాల అనర్థాలపై అవగాహన

నరసరావుపేట లీగల్, జూలై 22 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని రామిరెడ్డిపేటలోని చైతన్య జూనియర్ కళాశాలలో పల్నాడు జిల్లా ఎస్పీ కంచి శ్రీనివాసరావు ఆదేశాల మేరకు నరసరావుపేట డీఎస్పీ నాగేశ్వరరావు ఆధ్వర్యంలో 'డ్రగ్స్ వద్దు బ్రో' అంటూ మాదకద్రవ్యాల అనర్థాలపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఇన్‌స్పెక్టర్ చరణ్ విద్యార్థులతో మాట్లాడుతూ విద్యార్థి దశ అత్యంత విలువైనదన్నారు. డ్రగ్స్ వంటి మాదకద్రవ్యాలకు దూరంగా ఉండాలన్నారు. ఎస్.ఐ వంశీ కృష్ణ మాట్లాడుతూ డ్రగ్స్ వ్యసనంతో ఎంతో మంది యువత జీవితాలు నాశనమవుతున్నాయన్నారు. ఒత్తిడి వచ్చినప్పుడు సరైన మార్గాలను ఎంచుకోవాలని క్రీడలు, సంగీతం, చదువుపై దృష్టి పెట్టాలని, డిప్రెషన్ లేదా ఒత్తిడికి గురైతే పెద్దల సాయం తీసుకోవాలన్నారు. కార్యక్రమంలో విద్యార్థులు, అధ్యాపకులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

రెండో పట్టణ పోలీసుల ఆధ్వర్యంలో...

కాగా రెండో పట్టణ పోలీస్‌ల ఆధ్వర్యంలో ఇదే అంశంపై ఎస్కేఆర్‌బీ ఆర్ కళాశాలలో అవగాహన సదస్సు నిర్వహించారు. యువతను మత్తు పదార్థాల నుంచి దూరంగా ఉంచేందుకు ఈ కార్యక్రమాన్ని చేపట్టినట్లు సీఐ ఎం.హైమారావు తెలిపారు. కార్యక్రమంలో ఎస్ఐలు హరిబాబు ప్రియాంక విద్యార్థినీ విద్యార్థులు కళాశాల సిబ్బంది పాల్గొన్నారు.

పెట్రోలు దాడి కేసును నిశితంగా దర్యాప్తు చేయాలి

నూజెండ్ల, జూలై 22 (ఆంధ్రజ్యోతి): ఈ నెల 16వ తేదీన ఐనవోలులో జరిగిన పెట్రోల్ పోసి నిప్పంటించి ఇద్దరు మృతికి కారణమైన కేసులో నిశితంగా దర్యాప్తు చేసి దోషులను కఠినంగా శిక్షించాలని బాధిత కుటుంబ సభ్యులు ఐనవోలు ఎస్ఐ బీవీ కృష్ణారావును కోరారు. చికిత్స పొందుతూ గుంటూరులో మరణించిన పెదశ్రీను మృతదేహాన్ని తీసుకునేందుకు వచ్చి ఐనవోలు పోలీసులను, చీఫ్‌విప్ జీవీ ఆంజనేయులును కలసి ఈ కేసులో ఒకరినే అరెస్టు చేశారని, ప్రమేయం ఉన్న వారందరిపై కేసు నమోదు చేయాలని విజ్ఞప్తి చేశారు.

క్లుప్తంగా...

● నాదెండ్ల, జూలై 22 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా చేపట్టిన పీ-4 కార్యక్రమంపై ప్రతి ఒక్కరికీ అవగాహన కల్పించాలని సర్పంచ్ మొగిలి నాగలక్ష్మి కోరారు. కార్యక్రమంలో ఎక్కువమంది భాగస్వాములయ్యేలా చూడాలని సచివాలయ సిబ్బంది సూచించారు. కార్యక్రమంలో కార్యదర్శి మక్కెన సుబ్బారావు, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

● నాదెండ్ల: మండలంలోని సాతులూరులోని బండారుపల్లివారిపాలెంలో సీతలాంబదేవిని శాకంబరిదేవిగా అలంకరించారు. గ్రామానికి చెందిన వజ్జె వెంకటరావు కుటుంబ సభ్యులు అమ్మవారిని శాకంబరిగా అలంకరించి ప్రత్యేక పూజలు చేశారు. భక్తులకు తీర్థప్రసాదాలను పంపిణీ చేశారు.

● శావల్యాపురం: విత్తనాలు కొనేప్పుడు రైతులు తప్పకుండా రైతులు తప్పకుండా బిల్లులు తీసుకోవాలని జిల్లా వనరులకేంద్రం డీడీఏ మద్దినేని శివకుమారి అన్నారు. పొలం పిలుస్తోంది కార్యక్రమంలో భాగంగా మండలంలోని వేల్పూరు, కొత్తలూరు గ్రామాల్లో రైతులకు మంగళవారం పంటసాగు విధానంపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో డీఆర్సీ వ్యవసాయాధికారి అరుణ, ఇన్‌చార్జి ఎంఏవో రామినేని రామారావు, ఏఈవో పూరేటి అశోక, ఎంపీఈవో శ్రీనివాస్, వీఏఏ రామకృష్ణ పాల్గొన్నారు.

● ఈపూరు: రైతులు రసాయనిక ఎరువుల వినియోగం తగ్గించుకోవాలని డీఆర్‌సీ డీడీఏ శివకుమారి అన్నారు. మండలంలోని కొచ్చెర్ల, ఉప్పరపాలెం గ్రామాలలో మంగళవారం పొలం పిలుస్తోంది కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో మండల వ్యవసాయాధికారులు ఆర్ రామారావు,అరుణ,సోసైటీ డైరెక్టర్ అయినాల కోటేశ్వరరావు, రైతులు గోనుగుంట్ల శరభయ్య, ఎన్ చిన్న వీరయ్య, కిశోర్, కోటేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.